విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

గురువారం 31 జులై 2025 8 పేజీలు

విద్యుత్ చార్జీల నిలువు దోపిడి

ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక

విశాలాంధ్ర-ఏలూరు: ప్రమాదకర స్మార్ట్ మీటర్ల బిగింపు ఉపసంహరించి, విద్యుత్ చార్జీల నిలువు దోపిడీ ఆపాలని ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. స్మార్ట్ మీటర్ల బిగింపు రద్దు చేయాలని కోరుతూ నగరంలో పవర్ పేట రైల్వే స్టేషన్ వద్ద నుండి ఆర్.ఆర్ పేట మెయిన్ రోడ్డు మీదుగా అక్కడ ఉన్న ప్రజల వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ. రవి, ఐఎఫ్టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజల నుండి దోచుకోవడానికి ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. అదాని కంపెనీ రాష్ట్రంలో రెండు కోట్ల మంది వినియోగదారులకు పాత మీటర్లు తొలగించి స్మార్ట్ మీటర్లు బిగిస్తుందని ఇది మీటర్ మార్పు మాత్రమే కాదని, విధానాలు మార్చుతున్నారని తెలిపారు. విద్యుత్ పంపిణీ ప్రైవేటీకరణకు, కార్పొరేట్లకు కట్టబెట్టడానికి చేస్తున్న పెద్ద కుట్ర అని విమర్శించారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లను బిగించ వద్దని జరుగుతున్న పోరాటం, ప్రజా ఉద్యమంలో ప్రజలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఆగస్టు 5వ తేదీన విద్యుత్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత విద్యుత్ బిల్లులు విపరీతంగా పెరిగాయని, ట్రూ ఆఫ్ సర్దుబాటు చార్జీల పేరుతో జనం నుండి డబ్బులు వసూలు చేసే ▶మిగతా 2లో..

వనరుల పెంపుపై దృష్టి పెట్టాలి

శాఖాధిపతుల సమీక్షా సమావేశంలో కలెక్టర్ పి.ప్రశాంతి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : నగరపాలక సంస్థ ఆదాయ వనరుల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్, కమిషనర్(ఎఫ్.ఎ.సి) పి.ప్రశాంతి సూచించారు. నగర అభివృద్ధిపై శాఖాధిపతులతో బుధవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఏ నగరంలో అయినా రెవిన్యూ ఆదాయం గతంలో కన్నా మెరుగ్గా ఉందంటే.. ఆ నగరం అభివృద్ధి చెందుతున్నట్లేనని కలెక్టర్ అన్నారు. గతేడాది ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్ నగరంలో రూ. 88 కోట్లు కాగా.. ఈ ఏడాది కనీసం 10 శాతం పెరిగేలా కృషి చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి హౌస్ టూ హౌస్ సర్వేను వారం రోజుల్లో పూర్తి చేసి డిమాండ్ రైజింగ్ ను కూడా ప్రారంభించాలన్నారు. సెప్టెంబర్ నెలాఖరు నాటికి 65 శాతం వసూళ్లు జరిగేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనిచేయాలన్నారు. అనంతరం కలెక్టర్ నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని, ▶మిగతా 2లో..

పీ4లో మిల్లర్లు భాగస్వాములు కావాలి

ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: పి4లో భాగంగా సంపన్నులు, దిగువ పేద వర్గాలకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు ముందుకు రావాలని ఇంచార్జి కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. పి4లో భాగంగా జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం జాయింట్ కలెక్టర్ ఛాంబరులో రైస్ మిల్లర్స్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఇంచార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో దిగువ పేద వర్గాల వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పి4 కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. మార్గదర్శకులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని వారికి చేయూతనిస్తే ▶మిగతా 2లో..

‘అన్నదాత సుఖీభవ’కు ఈ-కేవైసీ

జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

విశాలాంధ్ర - కాకినాడ : అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి జిల్లాలోని అర్హులైన రైతులు తమ బ్యాంకు ఖాతాలకు ఎన్పీసీఎల్ లింక్, ఇన్ యాక్టివ్‌లో ఉన్న బ్యాంకు ఖాతాలకు ఈ-కేవైసీ చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా.. రెవెన్యూ, వ్యవసాయం, లీడ్ బ్యాంక్, పోస్ట్ ఆఫీస్ అధికారులతో అన్నదాత సుఖీభవ పథకంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం రైతన్నలకు అన్నదాత సుఖీభవ పథకం కింద అందించనున్న ఆర్థిక సహాయం అర్హులైన రైతులందరికీ అందేలా అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 2న పీఎం కిసాన్ నిధులతో పాటు అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లోకి రూ.7 వేలు జమ చేయనుందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అర్హులైన రైతులు తమ బ్యాంకు ఖాతాలకు ఎన్పీసీఎల్ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) లింక్ చేయించుకోవాలన్నారు. ఇన్ యాక్టివ్‌లో ఉన్న బ్యాంక్ ఖాతాలకు ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ అంశంపై సంబంధిత అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని జేసీ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో వెంకటరావు, వ్యవసాయ శాఖ జేడీ ఎన్. విజయ్ కుమార్, ఎల్డీఎం సీహెచ్ఎస్వీ ప్రసాద్, పోస్టాఫీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వడ్రంగి కార్మికులకు అండగా ఉంటా

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్రంలో కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని, వడ్రంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్పెంటర్(వడ్రంగి) అసోసియేషన్ 8వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవసభ అమలాపురం వాసర్ల గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ వడ్రంగి మేస్త్రిలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. ఏ కార్మికుడికి కష్టం వచ్చినా నేరుగా తనకు ఫోన్ చేయ వచ్చని నిండు సభలోనే తన ఫోన్ నెంబర్ను కార్మికులకు ఇచ్చారు. వడ్రంగి పని చక్కటి వృత్తి నైపుణ్యంతో కూడుకున్నదని, పనికి తగిన వేతనం, వారి జీవన విధానం మెరుగు పడేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సభకు రాష్ట్రం నలుమూలలనుండి, ఆయా జిల్లాల, మండలాల అధ్యక్షులు హాజరై నూతన అధ్యక్షుడి, కమిటీ కార్యవర్గ సభ్యులను ఎన్నుకొని ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర కార్పెంటర్స్ ▶మిగతా 2లో..

నాణ్యతకు నిదర్శనం బిఐఎస్

- పారిశ్రామికాభివృద్ధికి ప్రోత్సాహం
- కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: ఉత్పత్తుల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం వల్ల వినియోగదారుల సంతృప్తి, బ్రాండ్ విధేయతను పెంపొందిస్తుందని కలెక్టర్ కె. వెట్రిసెల్వి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో పరిశ్రమల శాఖ, ఎఫ్ఎస్ఎంఇతో కలిసి భారతీయ నాణ్యతా ప్రమాణాలపై(బిఐఎస్) నిర్వహించిన వర్క్‌షాపును కలెక్టర్ కె. వెట్రిసెల్వి జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిశ్రమలకు సంబంధించి ఎంఎస్ఎంఇ స్కీమ్‌లపై, ఇండస్ట్రియల్ వ్యా ▶మిగతా 2లో..

రైల్వే స్టేషన్లు, రైళ్లలో వైద్య సదుపాయాలపై కేంద్ర ప్రభుత్వ చర్యలు

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లు, ప్యాసింజర్ రైళ్లలో వైద్య అత్యవసర కేంద్రాల ఏర్పాటు,రాష్ట్రాల వారీగా రైల్వే స్టేషన్లలో వైద్య సదుపాయాల లభ్యత, ఫ్రంట్‌లైన్ వైద్య సిబ్బంది సంఖ్య,వైద్య సదుపాయాల నిర్వహణ వంటి అంశాలపై లోక్‌సభలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు

కేంద్ర రైల్వే, ఐటీ, సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రైల్వే స్టేషన్లు,రైళ్లలో ప్రయాణికుల వైద్య సదుపాయాల కల్పనపై న్యూఢిల్లీ ఏఐఐఎంఎస్ నిపుణులతో ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సుల ప్రకారం ప్రాణాపాయ సమయంలో ఉపయోగపడే మందులు, పరికరాలు, ఆక్సిజన్ సిలిండర్లతో కూడిన మెడికల్ బాక్స్ అందుబాటులో ఉంచాలని సూచనలు జారీ చేసినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. టికెట్ ఎగ్జామినర్లు, గార్డులు, స్టేషన్ మాస్టర్లు వంటి ఫ్రంట్‌లైన్ సిబ్బందికి ప్రథమ చికిత్స శిక్షణ ఇచ్చి,వారికి తరచుగా రిఫ్రెషర్ కోర్సులు కూడా నిర్వహిస్తున్నట్లు కేంద్రమంత్రి బదులిచ్చారు.

గ్రామకంఠం నివాసాలు క్షేత్రస్థాయిలో గుర్తించాలి

విశాలాంధ్ర-ముదినేపల్లి : గ్రామపంచాయతీ పరిధిలో గ్రామకంఠం భూముల్లో ఇల్లు నిర్మించుకున్న స్థలాలను గుర్తించి స్వామిత్వ పథకం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వై.రామకృష్ణ తెలిపారు. స్వామిత్వ పథకం నిర్వహణకు ఎంటిటి లకు శిక్షణ తరగతులు ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో అశోక్ మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాల నుండి గ్రామకంఠం భూముల్లో నివాసం ఉంటున్న వారికి నివాస ఆధార ధ్రువీకరణ లేకపోవడంతో ఈ సర్వేలో భూమిని గుర్తించి వారికి పట్టాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు నాటికి ముదినేపల్లి

మండలంలోని 24 గ్రామాల్లో ఈ సర్వే జరుగుతుందన్నారు. ఆగస్టు 2న గ్రామ సభలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, విలేజ్ సర్వేయర్లు, ఎంఎస్కేలు పాల్గొన్నారు.

బిఐఎస్ (1వ పేజీ తరువాయి)

పేరిట ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ రూపొందించిన పుస్తకాన్ని కలెక్టర్ వెట్రిసెల్వి ఆవిష్కరించారు. సమావేశ అనంతరం ఎంఎస్ఎంఇ పారిశ్రామిక వేత్తలకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వెట్రిసెల్వి మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రమాణాలను అమలు చేయడం అనేది నాణ్యత, భద్రత, వినియోగదారుల నమ్మకం కోణంలో అత్యంత అవసరమేనన్నారు. బిఐఎస్ పై మరింత అవగాహన కల్పించేం దుకు నియోజకవర్గ, మండల స్థాయిలో వర్క్‌షాపులు ఏర్పాటుచేయదలిస్తే అందుకు సహకరిస్తామన్నారు. జిల్లాలో 100 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలనే లక్ష్యంగా 60 యూనిట్లను గుర్తించినట్లు తెలిపారు. ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్ ఢిల్లీ పార్లమెంటు నుండి వర్చువల్‌గా మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహించి పరిశ్రమలు రావడానికి కృషి చేస్తామని అన్నారు. ఎఫ్ఎస్ ఎంఇ జాతీయ అధ్యక్షులు ఎపికె రెడ్డి మాట్లాడుతూ వస్తువుల కొనుగోలు విషయంలో భారత ప్రామాణిక సంస్థ బిఐఎస్ నాణ్యతకు నిదర్శనమన్నారు. బిఐఎస్ డైరెక్టర్ ప్రేమ్ సజనీ పట్నాల మాట్లాడుతూ పరిశ్రమల్లో నాణ్యతా ప్రమాణాల అమలు,ఐఎస్ఐ మార్కు ప్రాముఖ్యత, బిఐఎస్ సర్టిఫికేషన్ ప్రాసెస్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఎంఇ కన్వీనర్ ఎం. వేణుగోపాల్, జిల్లా పరిశ్రమల అధికారి పి. సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎల్ డిఎం డి. నీలాంద్రి, ఉపకార్మిక కమిషనర్ పి. శ్రీనివాసరావు, కాలుష్య నియంత్రణమండలి ఈఈ వెంకటేశ్వరరావు,స్కిల్ డెవలప్ మెంట్ ఆఫీసర్ ఎన్. జితేంద్ర, పలువురు పారిశ్రామిక వేత్తలు,బ్యాంకర్లు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ పై విస్తృత స్థాయి సమావేశం

విశాలాంధ్ర- పాలకోడేరు :మండల కేంద్రమైన పాలకోడేరులో ఉండి నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ పివిఎల్ నరసింహరాజు అధ్యక్షతన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ అనే అంశంపై బుధవారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహరాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు అమలుకు సాధ్యం కాని అనేక వాగ్దానాలు చేసి ప్రజలను మభ్యపెట్టారని అన్నారు. తీరా ఎన్నికలలో గెలిచిన తర్వాత హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఇది ముమ్మాటికి ప్రజలను మోసం చేయడమే అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటినా ఇచ్చిన హామీలలో సగం కూడా నెరవేర్చకుండా హామీలను నెరవేర్చినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. బాబు చేసిన మోసాలను ప్రతి వైసీపీ నాయకుడు, కార్యకర్త ప్రతి ఇంటికి తిరిగి తెలియజేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గస్థాయి, మండల స్థాయి, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అండగా ఉంటా

(1వ పేజీ తరువాయి)

అసోసియేషన్ అధ్యక్షునిగా తాటికొండ రంగబాబు, ప్రధాన కార్యదర్శిగా నరసింహ మూర్తి, ఉపాధ్యక్షులుగా గణాల సత్యసాయి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్య వర్గానికి మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ దృష్టికి వడ్రంగి కార్మికులు, మేస్త్రులు ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలు తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సుభాష్ ప్రభుత్వ పరంగా కార్మికులను అన్ని విధాల ఆదుకుంటామన్నారు. వడ్రంగి మేస్త్రిల అసోసియేషన్‌కు ఉమ్మడి జిల్లాలో భవనం ఉండేదని, కోనసీమ జిల్లాలో కూడా కమ్యూనిటీ హాలు మంజూరు చేయాలని కోరటంతో వడ్రంగి అసోసియేషన్ బిల్డింగ్ మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

భాగస్వాములు కావాలి

(1వ పేజీ తరువాయి)

వారు ఆర్థికంగా ఎదుగుతారన్నారు. జిల్లాలో వివిధ రంగాల్లో ఉన్న స్థితిమంతులు ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ముఖ్యంగా జిల్లాలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తమ వంతు సేవా కార్యక్రమాల్లో ముందుం టున్నా రన్నారు. పి4లో భాగంగా రైస్ మిల్లర్స్, సంపన్న రైతులు మార్గదర్శకులుగా రిజిస్టర్ చేసుకుని బంగారు కుటుంబాలుగా అర్హులైన పేదలను దత్తత తీసుకొని వారి అవసరాల మేరకు పేద విద్యార్థుల ఉన్నత చదువుకు, అనారోగ్యంతో ఉన్న వృద్ధులకు వైద్యం అందించడం, నిరుద్యోగ పేద యువతకు ఉద్యోగ కల్పన ద్వారా చేయూతనిస్తే బంగారు కుటుం బాల వారు ఆర్థికంగా ఎదుగుతారన్నారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సామంతపూడి శ్రీ రామరాజు స్పందిస్తూ తమ అసోసియేషన్ తరపున పేద వర్గాల పిల్లల ఉన్నత చదువులకు, నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని వారి పురోభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఓ కంటిపూడి శ్రీనివాసరావు, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ ఎండి ఇబ్రహీం, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎస్.సరోజ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సామంతపూడి శ్రీరామరాజు, అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

దృష్టి పెట్టాలి

(1వ పేజీ తరువాయి)

కార్యాచరణలో అభివృద్ధి కనపడాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. రోడ్ల నిర్మాణం డ్రెయిన్ టూ డ్రెయిన్ జరగాలన్నారు. పూర్తయిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులు త్వరగా జరిగేలా చూడాలన్నారు. లిక్విడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ యూనిట్ నిర్మాణం గురించి కలెక్టర్ అడుగగా డిసెంబర్ నాటికి పూర్తవుతుందని ఎస్ఈ తెలిపారు. సి అండ్ డి వేస్టును ప్రజలు నగరపాలక సంస్థ నిర్దేశించిన ప్రదేశాలలోనే పడవేసేలా సచివాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. తదనంతరం నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్న శానిటేషన్, డీసిల్టేషన్ పనులపై పబ్లిక్ హెల్త్ అధికారులతో మాట్లాడారు. వీధి వ్యాపారులకు సంబంధించి వారి జీవనోపాధికి భంగం కలగకుండా, ప్రజలకు అందుబాటులో ఉండేలా వెండింగ్ జోన్లు ఏర్పాటు చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. నగరపాలక సంస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, ఎస్ఈ(ఇంజనీరింగ్) ఎం.సీహెచ్.కోటేశ్వరరావు, ఎంహెచ్ఓ వినూత్న, రెవెన్యూ అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, రవికుమార్, మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసరావు, సీఎంఎం రామలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దోపిడి (1వ పేజీ తరువాయి)

విధానాన్ని అమలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులతో అక్రమ ఒప్పందాలు, అవినీతి చర్యలతో ఖర్చులు పెంచి ప్రజల నుంచి సర్దుబాటు చార్జీలు వసూలు చేయటం దుర్మార్గం అని మండిపడ్డారు. సీఐటీయూ నాయకులు, సిపిఎం నగర కార్యదర్శి పంపన రవికుమార్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కాకి నాని మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి రూ.32 వేల కోట్ల భారం వేసిందన్నారు. కూటమి నాయకులు ఎన్నికల సందర్భంగా తాము విద్యుత్ చార్జీలు పెంచబోమని, ఉన్న చార్జీలను తగ్గిస్తామని వాగ్దానం చేసి నేడు ప్రజలకు నమ్మకద్రోహం తలపెట్టిందని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యకార్యాచరణ నాయకులు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు నగర అధ్యక్షురాలు కొండేటి బేబీ, గొర్లి స్వాతి,సాయన్న అఖిలేష్,ఉప్పులూరి లక్ష్మి,బళ్ల కనకదుర్గారావు, ఆటోనగర్ అధ్యక్షులు అరుణకార నాగేశ్వరరావు, ఐఎఫ్‌టియు ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, నాయకులు పల్లి గంగరాజు, ఈ శ్రీను, హనుమంత స్వామి, సిఐటియు నాయకులు వైయస్ కనకారావు, సాహితీ స్రవంతి, కడలి రామాంజ నేయులు, తిరుపతిరావు, జి.అన్నవరం,డివైఎఫ్ఐ జిల్లా నాయకులు గేదెల శివకుమార్, పైడిరాజు రాంబాబు, సత్యనారాయణ, ఉప్పాడ నరసింహ స్వామి, జయరాం,సంధకం అప్పారావు, అన్నవరం, మోహన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్, ఐద్వా నాయకులు అరుణ కుమారి, యుటిఎఫ్ జిల్లా నాయకులు ఎండి జక్రియ తదితరులు పాల్గొన్నారు.

సర్వేపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-లింగపాలెం: గ్రామకంఠ భూములు, వ్యవసాయ భూములలో నిర్మాణాలను గుర్తించే సర్వేపై పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులకు డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు లింగపాలెం మండల పరిషత్తు కార్యాలయంలో రెండు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. సర్వేచేసే

విధానాన్ని వివరించారు. వ్యవసాయ భూముల్లో ఉన్న ఇల్లు, కాంపౌండ్ తదితర అంశాలకు సంబంధించి పూర్తిస్థాయిలో సర్వే చేయాలని సూచించారు. ఈ సర్వే వల్ల భవిష్యత్తులో వివాదాలు తలెత్తవని, రిజిస్ట్రేషన్లు చేయించుకోవడంలో ఇబ్బందులు ఉండవని అధికారులు తెలిపారు. లింగపాలెం మండలంలో ధర్మాజీగూడెం, లింగపాలెం, కొణిజర్ల, మఠంగూడెం, ఆసన్న గూడెం, కలరాయనగూడెం, కే. గోకవరం, ముడిచెర్ల, పాశ్చనాగారం,వేములపల్లి, సింగగూడెం,బాదరాలలో మొదటి విడత సర్వే ఆగస్టులో మొదలవుతుందని తెలిపారు.రెండు రోజులు పాటు శిక్షణను రిసోర్స్ పర్సన్ కుమార్ రాజా ఇచ్చారు.

తహశీల్దారుకు భవన నిర్మాణ కార్మికుల వినతి

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: కార్మిక సంక్షేమ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ద్వారకాతిరుమల మండల భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ద్వారకాతిరుమల తహశీల్దా రుకు వినతి పత్రం అంద జేశారు. రాష్ట్రంలో భవన నిర్మాణ రంగంలో లక్షలాది మంది కార్మికులు

పనిచేస్తున్నారన్నారు. వారికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి దాని ద్వారా ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసి కొంత నిధులను ప్రభుత్వం ఇస్తూ, మరికొంత నిధులు కార్మికులు బరాయించాలన్నారు. ఏఐటియుసి దేశవ్యాప్తంగా ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డును గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నాశనం చేసి వెల్ఫేర్ బోర్డును పక్కదారి పట్టించి కార్మికుల నడ్డివిరిచిందన్నారు. దాని కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక క్లెయిమ్‌లు పెండింగ్లో పడి కార్మికులకు ప్రమాదవశాత్తు ప్రమాదం జరిగితే ఎలాంటి ప్రయో జనం లేకుండా పోతుందన్నారు. యువగళం పాదయాత్రలో లోకేష్ హామీ ఇస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తక్షణం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి వారికి రావల్సిన అన్ని రకాల బెనిఫిట్సు అందిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి ఏడాది గడిచి ఇప్పటి వరకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయకుండా మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గొలుమే బాలయేసు, యడ్లపలి రమేష్, పెండ్లి భూషణం, యదవల్లి సుబ్బారావు, ఉండి దుర్గారావు, శ్రీకాకుళపు సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సేవాతత్పరుడు త్రిమూర్తులు

విశాలాంధ్ర -భీమవరం: సేవాతత్పరుడు, స్నేహశీలి గంటా త్రిమూర్తులు అని, తోటివారికి సేవచేయడంలో ముందు ఉండే గుణం ఆయన లక్షణమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఎఎంసి మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు అన్నారు. టీడీపీ బిసి

సాధికారిత కమిటీ డైరెక్టర్, కృష్ణ బలిజ సేవా సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి గంటా త్రిమూర్తులు పుట్టినరోజు వేడుకలను బుధవారం పట్టణ టీడీపీ అధ్వర్యంలో మిత్ర బృంద సభ్యులతో వారి స్వగృహంలో నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి శాలువాలు కప్పి గంటాను సత్కరించారు. గంటా త్రిమూర్తులు మరిన్ని పుట్టినరోజు వేడుకలు జరుపుకుని ఉన్నత పదవులు అధిరోహించాలన్నారు. అనంతరం పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు మద్దుల రాము, మైలబత్తుల ఐజాక్ బాబు, పట్టణ జాయింట్ సెక్రటరీ యలమంచిలి శ్రీనివాసరావు, తిప్ప బాలముత్యం, విన్నకోట వినాయక్, షాబు, 10వ వార్డు టీడీపీ కార్యకర్తలు, వారి మిత్ర బృంద సభ్యులు పాల్గొన్నారు.

వీరవల్లి ఆశయ సాధనకు కృషి చేయాలి

విశాలాంధ్ర -భీమవరం: సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు వీరవల్లి సత్యం ఆశయ సాధనకు పునరంకితం కావాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు పిలుపునిచ్చారు. కార్మిక, కర్షక, ఉద్యమనాయకుడు, పాత్రికేయుడు వీరవల్లి సత్యం వర్ధంతి పురస్కరించుకొని

బుధవారం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో రైస్ మిల్ వర్కర్స్ ఆధ్వర్యంలో పట్టణ సీపీఐ సమితి నివాళులు అర్పించింది. ఈ సందర్భంగా చెల్లబోయిన మాట్లాడుతూ చిన్నతనంలోనే కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితుడైన వీరవల్లి సత్యం తుది శ్వాస వరకు ఎర్ర జెండా వీడలేదని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉన్న రోజుల్లో ఆయన అగ్రనాయకులకు కొరియర్ గా పనిచేశారని గుర్తు చేశారు. నాడు యాళ్లబండి నడిపిన అన్ని ఉద్యమాల్లో వీరవల్లి సత్యం పాల్గొని పనిచేశారని గుర్తు చేశారు. తీరప్రాంత భూపోరాట యోధుడు నాగిడి సాంబమూర్తితో నిర్వహించిన భూ పోరాటాల్లో పాల్గొన్నారని, ఎల్.జి.పాడు, సిఎిడి భూ పంపిణీలో కీలకంగా పనిచేశారని చెల్లబోయిన గుర్తు చేశారు. విశాలాంధ్ర పాత్రికేయుడిగా పేదలు, కార్మికులు బలహీన వర్గాల వాణిని వినిపించారని, సమాజానికి ఎంతో సేవ చేశారని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని చెల్లబోయిన కోరారు. కార్యక్ర మంలో సీపీఐ నాయకులు పోతుల యాకోబు, పాలా త్రిమూ ర్తులు, విజయ్, సత్యనారాయణ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం

విశాలాంధ్ర -భీమవరం: మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని, పిల్లలకు మాయ మాటలు చెప్పి అపహరణ చేసే వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని 2వ అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎస్.జ్యోతి అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా

బుధవారం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీచింతల పాటి బాపిరాజు మునిసిపల్ హైస్కూల్లో మానవ అక్రమ రవాణా, జాగృతి పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తులపై అనుమానం కలిగితే స్కూలు యాజమాన్యానికిగానీ, తల్లిదండ్రులకుగానీ, పోలీస్ వారికిగానీ సమాచారం ఇవ్వాలని సూచించారు. 1వ అదనపు సివిల్ జడ్జి పి.హనీష మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి న్యూటన్ పిల్లలకు జనరల్ నాలెడ్జి ప్రశ్నలు అడిగి సమాధానాలు చెప్పిన విద్యార్థులకు న్యాయమూర్తుల చేతుల మీదుగా పుస్తకం, పెన్ను అందజేసారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు ఎన్.సుధీర్, ఎంబి.భవాని, జాగృతి టీం సభ్యులు న్యాయవాదులు పి.అంబేద్కర్, కె.జ్యోతి, టౌన్ స్టేషన్ మేనేజర్ శ్రీనివాస్, హెడ్ పోస్టాఫీస్ పిఆర్ఓ భాస్కర్‌రాజు, మీడియేషన్ న్యాయవాది కె.విజయలక్ష్మి, టూటౌన్ సబ్ ఇన్స్పెక్టర్ రామారావు, స్కూలు ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, పారా లీగల్ వలంటీర్లు చంద్రరావు, సూర్యనారాయణ, శ్రీలక్ష్మి, కాశేశ్వరి, గౌరి తదితరులు పాల్గొన్నారు.

పెయ్యేరు సర్పంచ్ చెక్ పవర్ రద్దు

విశాలాంధ్ర-ముదినేపల్లి : మండలంలోని పెయ్యేరు గ్రామ సర్పంచ్ చెక్ పవర్ ను రద్దు చేస్తూ జిల్లా పంచాయితీరాజ్ అధికారుల నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. గ్రామపంచాయతీలో ఏర్పడిన పరిణామాల క్రమంలో ఈ చర్యలు తీసుకున్నారు. ఈ పంచాయతీ ఇన్చార్జిగా డిప్యూటీ ఎంపీడీవో అశోక్‌కు అధికారులు బాధ్యతలు అప్పగించారు.

148 పెన్షన్లు మంజూరు

ముదినేపల్లి మండలంలో 148 వితంతు పెన్షన్లు మంజూరైనట్లు డిప్యూటీ ఎంపీడీవో అశోక్ తెలిపారు. గతంలో భర్తలను కోల్పోయిన మహిళలకు భర్తల పెన్షన్లు ప్రభుత్వం బదిలీ చేయడంతో ఈ పింఛన్లు మంజూరు చేసినట్లు వివరించారు.

స్మార్ట్ మీటర్లను నిరసిస్తూ ప్రచార జాత

విశాలాంధ్ర -భీమవరం: స్మార్ట్ మీటర్లపై ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రజా క్షేత్రంలోకి తీసుకువెళ్తామని, స్మార్ట్ ఒప్పందాలను రద్దుచేసి ప్రజలపై భారాలు తగ్గించేవరకు ఆందోళన తప్పదని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు చెల్లబోయిన రంగా రావు, జే.ఎన్.వి.గోపాలం అన్నారు. స్మార్ట్ మీటర్లు బిగింపు, అదానీ విద్యుత్ ఒప్పం దాలు, విద్యుత్ భారాలను నిరసిస్తూ బుధ వారం జెవిసి నాయకులు ప్రకాశం చౌక్, కేవిఎం, మావుళ్ళమ్మ గుడి మీదుగా కర పత్రాలు పంపిణీ చేస్తూ యాత్ర నిర్వహించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే వివిధ రకాల విద్యుత్ చార్జీలను ప్రజల మీద మోపి ప్రజలను పీడిస్తున్న ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో తట్టుకోలేని భారాలను ప్రజలపై మోపాలని చూస్తుందని అన్నారు. బిల్లులు చెల్లించే పద్ధతిలో మార్పు, అదనపు భారాలు వేయడం, అదుపు లేకుండా చార్జీలు పెరిగిపోవడం వంటివి ఈ స్మార్ట్ మీటర్లలో ఉన్నాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో వ్యతిరేకించిన నేటి పాలకులు వాటిని రద్దు చేయకుండా ప్రజలకు బలవంతాన అంట గట్టాలని చూస్తున్నారని అన్నారు. ఐదవ తేదీన విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు పి.యాకోబు, పాలా త్రిమూర్తులు, కొల్లాబత్తుల మహంకాళి, బి.వాసుదేవరావు, జక్కం శెట్టి సత్యనారాయణ, ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు చెల్లబోయిన వెంకటేశ్వర రావు, దేగల నాగేశ్వరరావు, గోపాలకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్వేశాఖ రక్తదాన శిబిరం

విశాలాంధ్ర -భీమవరం: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, జిల్లా సర్వే, భూమి రికార్డు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సర్వే శాఖ సిబ్బంది స్వయంగా రక్తదానం చేసి పలువురికి ప్రేరణగా నిలిచారు. భీమవరం, తణుకు బ్లడ్ బ్యాంక్ సెంటర్లలో తమ సిబ్బంది 19 యూనిట్లు రక్తదానం చేశారని జిల్లా సర్వే, భూమి రికార్డు శాఖ అధికారి కె.జాషువా తెలిపారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ ఎం.ఎస్.వి.ఎస్.రాంభద్రి రాజు, వైస్ చైర్మన్ పబిలిశెట్టి కనక రాజు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివ చేతుల మీదుగా రక్తదాతలకు గుర్తింపు ధృవపత్రాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కోఆర్డినేటర్లు మల్లేశ్వరరావు, వీరభద్రచారి, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు రాష్ట్రాల ఐటీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ లింగపాలెం వాసి

లింగపాలెంలో సంబరాలు

విశాలాంధ్ర-లింగపాలెం: ఏపీ,తెలంగాణ ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనరుగా నియమితులైన మోరంపూడి అనిల్ కుమార్ ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గం లింగపాలెం గ్రామానికి చెందిన వ్యక్తి. లింగపాలెం గ్రామానికి చెందిన అనిల్ కుమార్ ఉన్నత పదవి పొందటంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత పదవి పొందటం వెనుక పట్టుదల, కృషి ఎంతో ఉంది. లింగపాలెంలోని సంపన్న కుటుంబంలో అనిల్ కుమార్ జన్మించారు. ఈయన తండ్రి మోరంపూడి సత్యనారాయణ. వ్యవసాయమే ప్రధాన వృత్తిగా ఉన్న ఈయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మంచి వ్యక్తిగా పేరు ఉండటంతో సత్యనారాయణను 1987కు ముందు లింగపాలెం సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈయన పెద్ద కుమారుడు రంగా దామచౌదరి ఎంఎస్సీ పూర్తి చేశాడు.కలెక్టర్ అవ్వాలనేదే ఈయన లక్ష్యం. ఈపరిస్థితుల్లో తండ్రి గుండెపోటుకు గురవ్వ టంతో తాను అనుకున్న ఆశయాన్ని ఆపేసి కుటుంబ బాధ్యతలు తీసుకున్నారు.తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోయాననే బాధ వెంటాడుతున్నా తనకంటే పదేళ్ల చిన్న వయసులో పుట్టిన తమ్ముడిని ఉన్నత చదువు చదివించాలని ప్రోత్స హిస్తూ వచ్చారు. అన్న ఇచ్చిన ప్రోత్సాహం, తండ్రి సహకారంతో అనిల్ కుమార్ ఉన్నత స్థానంలో నిలబడ్డారు. బీటెక్ చేసిన ఈయన ఇనిస్టూట్ సోషల్ సర్వీస్ (టిస్) బొంబాయిలో చదివారు. ఆతరువాత 1989లో సివిల్స్ రాశారు. సివిల్స్‌లో 100వర్యాంకు సాధించి ఐపీఎస్‌కు సెలెక్ట్ అయ్యారు. పోలీసు ఉద్యోగ మంటే తండ్రికి ఇష్టం లేకపోవడంతో ఇండియన్ రెవిన్యూ సర్వీసెస్‌లో చేరారు. ఐఆర్ఎస్‌లో అధికారిగా బాధ్యతలను స్వీకరిం చిన ఈయన చెన్నై,ముంబాయి, బెంగుళూర్, హైదరాబాద్, కేరళ తదితర పట్టణాలలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. ఇప్పుడు పదోన్నతిపై రెండు రాష్ట్రాలకు ఐటీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిష నర్‌గా నియమితులయ్యారు.

సంపద కంటే విద్య అనే ఆయుధం విలువైనది: తన తమ్ముడు ఇంతటి ఉన్నత పదవిలో ఉండటానికి ఎంతో కష్టపడ్డాడని తాను అందించిన సహకారం, ప్రోత్సాహన్ని సద్వినియో గించుకొని ఉన్నత స్థాయికి ఎదిగాడని ఈయన అన్న రంగదామాచౌదరి విశాలాంధ్రతో అన్నారు. సంపద ముఖ్యం కాదని విద్య అనే ఆయుధం ప్రతి మనిషికి ఎంతో అవసరమని తన తండ్రి సత్యనారాయణ ఇచ్చిన స్ఫూర్తితో విద్యలో మంచి ఫలితాలు సాధించగలిగామని తెలిపారు. అరకులో ట్రైబల్స్ కోసం నాలుగు పాఠశాలలు నిర్మించినట్టు తెలిపారు. ఏలూరు సి.ఆర్.రెడ్డి కాలేజీ గవర్నింగ్‌బాడీ మెంబర్‌గా ఉంటూ విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేశా మని, చేస్తున్నామని తెలిపారు. తన తమ్ముడు అనిల్ కుమార్ ఈస్థాయికి వెళ్లటం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. తన తమ్ముడిని ఆదరిస్తున్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

5న విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర-చింతలపూడి: స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆగస్టు 5వ తేదీన విద్యుత్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని ప్రజా వేదిక డిమాండ్ చేసింది. బుధవారం ఎర్రగుంటపల్లి

గ్రామంలో సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ రెడ్‌స్టార్ ఆధ్వర్యంలో మూడవరోజు సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ సీనియర్ నాయకులు జంగా రామచంద్రారెడ్డి, సిపిఐ ఎంఎల్ రెడ్‌స్టార్ నాయకులు డి.రంగనాథ్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల విధానాన్ని వ్యతిరేకించిన లోకేష్ ఇప్పుడు అదానికి భయపడి స్మార్ట్ మీటర్ల బిగింపు విధానాన్ని అవలంబిస్తున్నారన్నారు. దీనికి వ్యతిరేకంగా ఆగస్టు 5వ తేదీన జరిగే ధర్నా జయప్రదం చేయాలన్నారు. ఈ సంతకాల సేకరణలో సీపీఐ మండల కార్యదర్శి తోర్లపాటి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కంచర్ల గురవయ్య, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి దంతా కృష్ణరైతు సంఘం నాయకులు తాడిగడప మాణిక్యాలరావు, సీపీఎం నాయకులు డి.సత్యనారాయణ, వాసు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల పేరుతో దోపిడి

విశాలాంధ్ర-ఏలూరు: స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోపిడీ చేస్తున్నారని సీపీఐ కామవరపుకోట మండల కన్వీనర్ టీవీఎస్ రాజు విమర్శించారు. స్మార్ట్ మీటర్లు వద్దు...పాత మీటర్లు ముద్దు అనే నినాదంతో

కామవరపు కోటలో చౌత్కా సెంటర్లో సీపీఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, విద్యుత్ చార్జీల నిలువు దోపిడీ ఆపాలని కోరుతూ కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా టీవీఎస్ రాజు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి రూ. 32 వేల కోట్లు ప్రజలపై భారమేసిందని విమర్శించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని వైసీపీ ప్రభుత్వం ఆనాడు స్మార్ట్ మీటర్లు పెట్టదానికి నిర్ణయం తీసుకుంటే నాడు ప్రతిపక్షంలో ఉన్న లోకేష్ తో సహా కూటమి నాయకులు విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు పెట్టదానికి వచ్చేవారిని తరిమి కొట్టడంతో పాటు స్మార్ట్ మీటర్లను పగులు కొట్టండి అని విద్యుత్ వినియోగదారులకు పిలుపునిచ్చారని అన్నారు. స్మార్ట్ మీటర్ల విధానాలకు స్వస్తి చెప్పకపోతే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. అనంతరం రాస్తారోకో నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గుమ్మడి లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, సీపీఐ మండల కో కన్వీనర్ జి.సత్యనారాయణ, మండల కార్యవర్గ సభ్యులు చలమాల శ్రీనివాసరావు, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోతాటి వెంకటేశ్వరరావు, నల్లమోతుల అప్పన్న, బాలిన రమణరావు, పరస శ్రీను, సీపీఐ సీనియర్ నాయకులు అడపా సత్యనారాయణ, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాకిన సత్యనారాయణ, దొడ్డకుల నారాయణతో పాటు ఆటో డ్రైవర్లు, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి ఎస్సైగా క్రాంతి కుమార్

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : జీలుగుమిల్లి ఎస్సైగా వి.క్రాంతి కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్టేషన్ సిబ్బంది ఆయనకు పుష్ప గుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. పేకాట, కోడిపందాలు జూద క్రీడలు జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టనున్నట్లు ఆయన తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉందని అధికారులు, నాయకులు, ప్రజలు సహకరించాలని సూచించారు.

ఉద్యోగుల, ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు చెల్లించేది ఎప్పుడు?

ఎస్టీయూ ప.గో. జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి వర్మ

విశాలాంధ్ర -కాళ్ళ : ఉపాధ్యాయుల సంపాదిత సెలవులు వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి పెనుమత్స ఆర్.వి.ఎస్ సాయి వర్మ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రకటన విడుదల చేశారు. సంపాదిత సెల వులు ఇప్పటికే రెండుసార్లు పెట్టు కుని ఉన్నా వాటికి సంబంధించి నగదు మాత్రం జమ కాలేదని, వీటికి గత మూడు సంవత్సరాలుగా ఏమాత్రం పురోగతి లేదన్నారు. వాటికి సంబంధించిన డబ్బులు ఉద్యోగస్తుల ఉపాధ్యాయుల బ్యాంకు ఖాతాలలో పడినట్టుగా భావించి ఇన్కమ్ టాక్స్ లు కూడా కట్టినట్టు ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వం కూడా ఈ బాకీలను క్లియర్ చేయలేదని, ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన తర్వాతైనా వాటికి మోక్షం లభిస్తుందని ఉద్యోగస్తులు, ఉపాధ్యాయులు భావించారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం పూర్తయినా ప్రస్తుతం ఉన్న ప్రభుత్వంలో స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ లో ఉన్న బకాయిలన్నింటిని ఉపాధ్యాయులకు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

సీపీఐ గణపవరం మండల కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - గణపవరం: సీపీఐ గణపవరం మండల కార్యదర్శిగా పెనగంటి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా తాడేల వాసు ఎన్నికయ్యారు. గణపవరం శ్రీ కన్యకా పరమేశ్వరి వర్తక సంఘ భవనంలో బుధవారం జరిగిన సీపీఐ గణపవరం మండల 4వ మహాసభలో సీపీఐ గణపవరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా పెనిమింటి సత్యనారాయణ, యాళ్ళ నాగేశ్వరరావు, సీహెచ్ శ్రీను, పిల్లా నాగేశ్వరరావు, జి. రాజు ఎన్నికయ్యారు. ఆగస్టు 19,20 తేదీలలో తణుకులో జరుగనున్న సీపీఐ 27వ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని మహాసభ తీర్మానించింది. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్విరామంగా కృషి చేసి సీపీఐ బలోపేతానికి పూనుకోవాలన్నారు. రైతులు, ఆక్వా రైతులు, కౌలు రైతుల సమస్యలు పరిష్కారం కోరుతూ ఉద్యమించాలన్నారు. పేదలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని కోరుతూ ఆందోళ నలు నిర్వహించాలని భీమారావు కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. సీతారాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశంసలందుకున్న 'బుద్ధుడితో నా ప్రయాణం' నాటకం

విశాలాంధ్ర -భీమవరం: ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి భీమవరం డీఎన్నార్ కళాశాలలోని రామకృష్ణ సభా భవనంలో ప్రదర్శించిన నృత్య రూప నాటకం బుద్ధుడితో నా ప్రయాణం నాటక విమర్శకులచే ప్రశంసలందుకుంది. రాజ్యాంగ నిర్మాత బీ.ఆర్. అంబేద్కర్ రాసిన బుద్ధుడు ఆయన ధర్మం పుస్తకం ఆధారంగా రూపొందించిన నాటక ప్రదర్శన ఆద్యంతం ఆసక్తిగా సాగింది. ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు కుమారుడు సుందర్ రాజు నాటక ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. వర్తమాన సమాజానికి గౌతమ బుద్ధుని బోధనల అవసరం ఉందని, భారతీయ బౌద్ధ మహాసభ వ్యవస్థాపకులు బోధిసత్వ డాక్టర్ అంబేద్కర్ ఆత్మచేతనను, బుద్ధధర్మంలోని మానవతా విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయోగమే బుద్ధునితో నా ప్రయాణం నాటకమని అన్నారు. ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా నేషనల్ ట్రస్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎలిచర్ల హరిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనా జోసెఫ్ మాట్లాడుతూ ఈ నాటకం ఒక కళాత్మక ప్రదర్శన మాత్రమే కాదని, మానవజాతికి మార్గదర్శకంగా నిలిచే ధర్మబోధన అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఈది రవికుమార్, జనరల్ సెక్రెటరీ కొల్లి శ్రీనివాస్, గంట సుందర్ కుమార్ అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పి4 నీడ్ అసెస్మెంట్ సర్వే పరిశీలన

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం పురపాలక సంఘం 16వ వార్డులో బుధవారం ఇంచార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పి4 నీడ్ అసెస్మెంట్ సర్వేను పరిశీలించారు. వార్డులో పి4 అవగాహన సభ ఏర్పాటు చేశారా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. పి4 యాప్ ద్వారా అర్హత గల బంగారు కుటుంబాల వివరాలను పరిశీలించారు. అందుబాటులో ఉన్న రెండు బంగారు కుటుంబాల సభ్యులను కలిసి వారి ఆర్థిక పరిస్థితి, పిల్లల చదువులు, ఆరోగ్య పరిస్థితులు, వారు కోరుకుంటున్న అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను ఇంచార్జి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవోను ఆదేశించారు. ఆర్డీవో ఖతీబ్ కౌసర్‌భానో, వార్డు పరిపాలన కార్యదర్శి సీ.హెచ్ మోహన్ కృష్ణ, సచివాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మానవ అక్రమ రవాణాను సమిష్టిగా నిరోధించాలి

విశాలాంధ్ర-చింతలపూడి : ఏలూరు జిల్లాలోని చింతలపూడి నగర పంచాయతీలో మానవ అక్రమ రవాణాను సమాజం సమిష్టిగా నిరోధించాలని చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్ మధుబాబు అన్నారు. మానవ అక్రమ నిరోధక దినోత్సవం అర్చన జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఆయన మాట్లాడుతూ, పిల్లలు బాధ్యతగా చదువుకోవాలని, ప్రేమ వివాహాలకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఆడపిల్లలు మోసపోతున్నారని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ టి.క్రాంతి కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మాణిక్యాలరావు, అడ్వకేట్ దుర్గ భవాని, సోషల్ వర్కర్ అక్బర్ అలీ, కోర్టు సూపరింటెండెంట్ పి.గుర్వి నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధం అందరి బాధ్యత

విశాలాంధ్ర - నరసాపురం: మనుషుల అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యత అని వెలుగు ఏపీఎం ప్రభుదాస్ అన్నారు. ప్రపంచ మనుషుల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మొగల్తూరులో హైదరాబాద్ ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మనుషుల అక్రమ రవాణా నిరోధం పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా వెలుగు కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు వీఓఏఎస్,అంగన్వాడీ వర్కర్స్ తో అవగాహన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అక్రమ రవాణా అనేది ప్రపంచం లోనే అతి పెద్ద నేరం అన్నారు.ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు అక్రమ రవాణాకు గురవుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరు అక్రమ రవాణా పై అవగాహనా కలిగి ఉండాలన్నారు. ప్రజ్వల కోఆర్డినేటర్ శ్రావ్య శృతి మాట్లాడుతూ మహిళలు అక్రమ రవాణా, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ పని చేస్తుందన్నారు. 28 సంవత్సరాలుగా పద్మశ్రీ డాక్టర్ సునీతకృష్ణన్ ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ, పోలీస్, విద్య, న్యాయ శాఖల సమన్వయంతో 29,200 మంది అమ్మాయిలు, మహిళలను రక్షించి వారికి పునరావాసం కల్పించామన్నారు. సీడీపీవో ఊర్మిళ మాట్లాడుతూ నేటి కాలంలో యువత మొబైల్ ఇంటర్నెట్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్ కి గురి అవుతున్నారని తెలిపారు. ఇటువంటి సందర్భాలలో 1930 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్స్ అనిల్ కుమార్, చెన్న కేశవులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ ఏలూరు జిల్లా నూజివీడు మున్సిపాలిటీ ఏరియాలో చేరిన ద్వారక రెసిడెన్సీ పి.జి. సెంటర్, నూజివీడు గ్రామ కాపురస్తులైన బాణావతు రాములు గారి కుమార్తె ఆయిన బాణావతు ఉషారాణి గారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియ జేయునది ఏమనగా నా క్లయింట్ తాలూకు నూజివీడు గ్రామములోని పాత ఆర్.ఎస్.నెం. 450/1 నోషనల్ లెక్కల ప్రకారం ప్రస్తుత ఆర్.ఎస్.నెం.450/56 ద్వారక రెసిడెన్సీ అపార్ట్మెంట్ లోని ఫస్ట్‌ఫ్లోర్ లోని ఫ్లాట్ నెం. 103, చ.గ. లు 35.22 ప్లింతు ఏరియా, కామన్ ఏరియా, చ.అ. 575 లు మరియు పార్కింగ్ 25 చ.అ. మొత్తం వెరశి 600 చ.అ.లు అపార్ట్మెంట్ లోని లింకు ఒరిజినల్ దస్తావేజు నెం. 5759/2007 గా ద్వారక కన్‌స్ట్రక్షన్ తరుపున మేనేజింగ్ పార్టనర్ గారు అయిన మేకా వెంకట ప్రతాప్ అప్పారావు గారి కుమారుడు మేకా వెంకట వేణు గోపాల అప్పారావు గారి నుండి నూజివీడు మండలం కొత్తపేట గ్రామ కాపురస్తులైన పసారి మదన్ సింగ్ గారి కుమార్తె పసారి జయశ్రీ గారు క్రయం పొంది ఉన్న దస్తావేజును నా క్లయింట్ ద్వారక అపార్ట్మెంట్ లోని లింక్ ఒరిజినల్ అయి వున్నది. సదరు దస్తావేజును ది: 23-07-2025 జిరాక్సు తీసుకోవడం కోసం ఇంటి దగ్గర నుండి ఆటోలో బయలు దేరి జిరాక్సు షాపుకి వెళ్ళి చూసుకొనగ సదరు దస్తావేజును ప్రయాణములో జారిపోయినది. సదరు ఒరిజినల్ దస్తావేజును దొరికిన యెడల ఈ దిగువ చిరునామాకి అందించినచో తగిన పారితోషకం ఇవ్వబడును.

ఆర్లపాటి సురేష్, న్యాయవాది / నోటరి
నూజివీడు. సెల్:7989459105.
ప్రదేశం : నూజివీడు తేది : 30.07.2025

రహదారి విస్తరణ పనుల వద్ద ప్రమాద సూచికలు నిల్

- ప్రాణాలు కోల్పోతున్న వైనం
- పోలరాజ్ మురుగు కాలువలోకి దూసుకెళ్లిన కారు
- ఇస్రో రిటైర్ ప్రొఫెసర్ మృతి

విశాలాంధ్ర-ముదినేపల్లి : జాతీయ రహదారి విస్తరణ పనులు ముదినేపల్లి మండలంలో అస్తవ్యస్తంగా ఉండడం సక్రమంగా క్రమ పద్ధతిలో పనులు నిర్వహణ సాగక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. ముదినే పల్లి పోలరాజ్ మురుగు కాలువ వరకు రహదారి నిర్మాణం జరిగింది. వంతెన సమీపంలో వాహనాల దారి మళ్లింపు సూచిక లేకపోవడంతో తిన్నగా వస్తున్న వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. మండవల్లి మండలం లింగాల గ్రామానికి చెందిన చందు వెంకటేశ్వరరావు (65) భార్యతో కలిసి హైదరాబాద్ నుండి వస్తుండగా రాత్రి సుమారు 8 గంటలకు కారు మురుగు కాలువలోకి దూసుకెళ్లింది. ప్రొఫెసర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన వెంకటేశ్వరరావు మృతి చెందగా భార్యను స్థానిక వ్యక్తులు ఒడ్డుకు చేర్చారు. ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడమే ప్రమాదానికి కారణమని స్థానికులు పేర్కొంటున్నారు. అంబేద్కర్ నగర్, కాలనీ నుండి పెట్రోల్ బంక్, కైకలూరురోడ్ వద్ద వాహనాల డైవర్షన్ల సూచికలు వెంటనే ఏర్పాటు చేసి ప్రాణాలు కాపాడాలని స్థానికులు , వాహనదారులు కోరుతున్నారు.



సంతకాలు సేకరించిన వామపక్షాలు

విశాలాంధ్ర - వేలేరుపాడు : స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా, పెంచిన విద్యుత్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో మండలంలో పలుచోట్ల బుధవారం సంతకాలు సేకరించారు. రాష్ట్ర వామపక్షాల పార్టీల పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు నాయకులు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం 9 సార్లు కరెంటు చార్జీలు పెంచి రూ. 32 వేల కోట్లు భారం ప్రజలపై వేసిందన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం గద్దెనెక్కాక మాటతప్పి నమ్మకద్రోహం చేసిందన్నారు. అక్రమ ఒప్పందాలు, అవినీతి చర్యలతో ఖర్చులు పెంచి ప్రజల నుండి ఆ సర్దుబాటు ఛార్జీలు వసూలు చేయడం అన్యాయం అన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేకుంటే రాబోయే రోజుల్లో మరిన్ని పోరాటాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పిట్ట ప్రసాద్, బంధం నాగేశ్వరరావు, కంగాల గంగరాజు, తాటి దుర్గారావు, జాను బాబు, యర్ర మధు, సోడే కన్నారావు, పిట్టా భీమయ్య సిపిఎం నాయకులు మడకం ఏసు, కారం వెంకటరావు, కొత్త వెంకటేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు కట్ట ముత్యాలరావు, వీరన్న, ఉకే రవికుమార్, వెంకట్రావు, కంటిపల్లి నాగేంద్రం, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్కే ఇబ్రహీం, ఏపూరి వెంకటస్వామి, మాచర్ల భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఎస్.సి. సెల్ మండల అధ్యక్షునిగా భాను ప్రసాద్

విశాలాంధ్ర - కుక్కునూరు : వైసీపీ ఎస్సీ సెల్ విభాగ కుక్కునూరు మండల అధ్యక్షునిగా చిలకా భానుప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధిష్టానం ఆదేశాల మేరకు పోలవరం నియోజకవర్గ ఇంచార్జి తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో ఏకగ్రీవ ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా భానుప్రసాద్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి, బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో కుక్కునూరు ఎంపీపీ చేబ్రోలు గీతావాణి, సర్పంచ్ రావు మీనా తదితరులు పాల్గొన్నారు.

"హౌస్ ఫర్ ఆల్" కోసం క్షేత్ర స్థాయిలో తనిఖీలు

- ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్

విశాలాంధ్ర - రాజ మహేంద్రవరం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఎం. 23 ప్రకారం రాజ మండ్రి రూరల్ నియో జక వర్గం పరిధిలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించినట్లు రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్.కృష్ణనాయక్ తెలియచేశారు. బుధవారం రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు గ్రామ పరిధిలో ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసు కున్న అర్హుల జాబితాను స్వయంగా పరిశీలిం చారు. ఈ సందర్భంగా రాజమండ్రి రూరల్‌లో 413 దరఖాస్తులు అనర్హు లుగా తేలినట్లు తెలి పారు. అర్హుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శ కంగా, ప్రభుత్వ మార్గ దర్శకాల ప్రకారం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఆర్డీఓ వెంట రాజ మండ్రి రూరల్ ఇన్చార్జి తహశీల్దార్ శ్రీనివాసరావు, సిబ్బంది, ఉన్నారు.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచేందుకు దోహదం

-గాయత్రి విద్యాసంస్థల్లో ఆకట్టుకున్న ఫ్రెషర్స్ డే వేడుకలు

- శాసనసభ్యులు బత్తుల బలరామ కృష్ణ

విశాలాంధ్ర - రాజా నగరం : కళాశాలల్లో నూతనంగా అడుగుపెడు తున్న విద్యార్థుల్లో ఆత్మవిశ్వా సం పెంచేందుకు ఫ్రెషర్స్ డే వంటి వేడుకలు దోహదపడతాయని రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ అన్నారు. మండలంలోని కానవరం గ్రామంలోని గాయత్రి విద్యాసంస్థలలో విద్యాసంస్థల అధినేత వివివిఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో విద్యాసంస్థల ప్రిన్సిపల్ దేవీ బంగారం అధ్యక్షతన బుధవారం జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ కొత్త విద్యార్థులకను ఆప్యాయంగా స్వాగతం పలుకుతూ విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయన్నారు.విశిష్ట అతిథిగా విచ్చేసిన రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగిన సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి వేది కలు వేడుకలుగా నిలుస్తాయన్నారు. విద్యాసంస్థల అధినేత వివి ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ తమ విద్యాసంస్థలు గ్రామీణ ప్రాంతంలో ఆహ్లాదక రమైన వాతావరణంలో ఏర్పాటు చేసి కార్పొరేట్ విద్యాసంస్థలకు పోటీగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ దేవి బంగారం మాట్లా డుతూ విద్య సంస్థలు సాధించిన ఉత్తమ ఫలితాలను వెల్లడించారు.దీనిలో విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇంటర్మీడియట్ మొదటి ఏడాదిలో 400కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు అతిథులు చేతులు మీదుగా మెమొంటోలు, నగదు, బహు మతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాజకీయ రాష్ట్ర నాయ కులు ఆళ్ళ గోవింద్, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, విద్యాసంస్థలు అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మానవతా ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - గోపాల పురం : రక్తదానం చేసి పది మంది ప్రాణాలను కాపాడాలని తహసిల్దార్ అజయ్ బాబు కోరారు. బుధవారం స్థానిక శార్వాణి రెసిడెన్షియల్ స్కూల్ నందు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సంద ర్భంగా తహసిల్దార్ అజయ్ బాబు మాట్లాడుతూ ప్రమాదాల బారిన పడి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న వారి ప్రాణాలు కాపాడేందుకు ఈ శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు మాట్లా డుతూ ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరిని ఆదుకోవడమే మానవతా సంస్థ ధ్యే యమని తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో సుమారు 150 మంది యువకులు తమ రక్తాన్ని దానం చేశారు. రక్తదానం చేసిన దాతలకు మానవతా సంస్థ సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో మానవత మండల సంస్థ అధ్యక్షులు రాపాక పని కిషోర్, మానవతా రక్త నిధి ప్రతి నిధి జొడాల వెంకటేశ్వరరావు, జడ జోగేంద్ర ప్రసాద్, మానవత సభ్యులు కృపా రెడ్డి, కీర్తి కుమార్, రాధాకృష్ణ, నెల్లి చంద్రశేఖర్, కాట్రు తారక్, మరపట్ల హరికృష్ణ, భూ రెడ్డి వాసు, మానవతా సభ్యులు పాల్గొన్నారు.

సేవలందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : మంత్రి కందుల

విశాలాంధ్ర - నిడదవోలు : రోగులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్ప వని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ సమిశ్ర గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బందిని హెచ్చరిం చారు. రాత్రిపూట ఆస్పత్రి మూసివేస్తున్నారన్న రోగుల ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని నిడదవోలు మండ లం సమిశ్రగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి దుర్గేష్ ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు వైద్య సేవలు అందించకుండా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించ బోమని మంత్రి దుర్గేష్ వైద్యసిబ్బందిని హెచ్చరించారు. పీహెచ్ సీలో ఎంత మంది వైద్యులు, సిబ్బంది ఉన్నారు, మందులు అందుబాటులో ఉన్నాయా లేవా, అత్యవసర వైద్యసేవలు రోగులకు ఏ మేర అందుతు న్నాయన్న అంశంపై సమగ్రంగా ఆరా తీశారు. రోగు లతో మాట్లాడి అందుతున్నా వైద్య సేవలపై ఆరా తీశారు. రోగులు ఎప్పుడు వచ్చినా అత్యవసర సేవలను అందించేందుకు 24 గంటలు పాటు పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో నాసా కార్యక్రమం

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి శ్రీ చైతన్య పాఠ శాలలో నాసా కార్యక్రమం పై తల్లి దండ్రులకు బుధవారం వివరించారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ వినూత్న మాట్లాడుతూ నాసాయొక్క గొప్పతనం గురించి వివరించారు. శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులు నాసాలు సాధించిన సర్టిఫికెట్ ద్వారా ఉన్నతమైన ఉద్యోగం సాధిం చడానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా నాసాలో సాధిం చిన సర్టిఫికెట్లను విద్యార్థులకు తల్లిదండ్రులకు సమక్షంలో అందజేశారు కార్యక్రమంలో ఆర్ వీర వెంకట సత్యనారాయణ, నాసా ఇన్చార్జ్ ఎస్కే ఇస్మాయిల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - కడియం : మైనర్లపై లైంగిక వేధింపుల కేసులు పెరిగిపోతున్న నేపథ్యంలో, వారికి రక్షణ కల్పించ డానికి పోక్సో చట్టం ఎంతో అవసరమని కడియం మహిళా ఎస్ఐ ధనలక్ష్మి ప్రసన్న అన్నారు. సిఐ అల్లు వెంకటేశ్వర రావు ఉత్తర్వుల మేరకు ఎస్ఐ పి ధనలక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యం లో మురమండ గ్రామం డిగ్రీ కళాశాలలో బుధవారం ఫోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భం గా ఎస్ఐ ధనలక్ష్మి ప్రసన్న మాట్లాడుతూ ఫోక్సో చట్టం పిల్లల హక్కులను కాపాడుతుందని, వారికి సురక్షితమైన వాతావర ణాన్ని కల్పిస్తుందని తెలిపారు. వాటిని ఉపయోగిస్తే ప్రభు త్వం విధించే శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. కొత్తగా మారిన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు.

రీ సర్వే పేజ్-3 కి సహకరించండి

విశాలాంధ్ర - తాళ్లపూడి : ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్ట్ లో భాగంగా తూర్పు గోదావరి జిల్లా, కొవ్వూరు డివిజన్ పరిధి లోని తాళ్లపూడి మండ లంలో రీసర్వే ఫేజ్3 కార్యక్రమాన్ని అమలు చేసేం దుకు చర్యలు చేపట్టామని తాళ్లపూడి తహసీల్దార్ లక్ష్మీ లావణ్య వెల్లడించారు. జిల్లా అధికారుల ఆదే శాల మేరకు అన్నదేవరపేట, తాళ్లపూడి, కుకు నూరు, వేగేశ్వరపురం, పెద్దేవం, మలకపల్లి, గ్రామాల్లో మొదటగా ఈ కార్యక్రమాన్ని చేపట్టి నట్లు, దీనిలో రెవెన్యూ రికార్డులు, భూమి పై గల వ్యత్యాసాలను గుర్తించి సరిచేయడం, గ్రామ సరి హద్దులు నిర్ధారించడం, గ్రామం లో గల ప్రభుత్వ భూముల సరిహద్దులను కొలత వేసి నిర్ధారిం చటం, రైతు వారీ భూములను సర్వే చేసి రీ సర్వే రికార్డులు తయారు చేయబడు తాయని పేర్కొ న్నారు. కావున ఆయా ఆయా గ్రామంలోని ప్రజలు, రైతులు అందరూ గ్రామ రెవెన్యూ అధి కారి, గ్రామ సర్వేయర్‌కి సహకరించాలని తెలియజేశారు.

గంజాయి రవాణా పై నిరంతరం నిఘా : డీఎస్పీ శ్రీకాంత్

విశాలాంధ్ర - సీతానగరం : గంజాయి రవాణా పై నిరంతరం నిఘా పోలీసుల నిఘా ఉంటుంది అని డీఎస్పీ వై శ్రీకాంత్ అన్నారు. ప్రశాంతమైన సీతా నగరం మండలంలో గంజాయి పట్టుబడ్డంతో కల కలం రేపింది. దీనిపై డీఎస్పీ శ్రీకాంత్ విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు , నార్త్ జోన్ డిఎస్పి వై.శ్రీకాంత్, సిఐ వై సత్య కిషోర్ పర్యవేక్షణలో సీతానగరం ఎస్సై డి రామ్ కుమార్ కుమార్ గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని పక్కా సమాచారంతో సీతానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్గొండ గ్రామ శివారు మామిడ తోట వద్ద ఐదు గురిని గమనించి వారి వద్ద నుండి విఆర్ఓ సమక్షంలో 5 ప్యాకెట్స్‌లో ఉన్న సుమారు 2.57 కిలోల గం జాయిని, ఒక ద్విచక్ర వాహనం, 1500 రూపాయల నగదును వారి వద్ద నుండి స్వాధీనం చేసుకొన్నా మని అన్నారు. గంజాయి రవాణా, విక్రయాల చేసే వారి పై నిరంతరం నిఘా ఉంటుంది అని, అట్టి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీను, గోవింద్ ,ట్రైనింగ్ ఎస్ఐ బి సురేష్, కానిస్టేబుల్ ఎల్లరావు, కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

కృష్ణాజిల్లాకు వంగవీటి రంగా పేరు పెట్టాలి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : ప్రజా నాయకుడు వంగ వీటి మోహన రంగా సేవలకు గుర్తించి, కృష్ణాజిల్లాకు వంగవీటి రంగా పేరు పెట్టాలని ఆంధ్ర, తెలంగాణ రాధా, రంగా మిత్ర మండలి చారిటబుల్ ట్రస్ట్ వ్యవ స్థాపక అధ్యక్షుడు పన్నాస పూర్ణ చంద్రరావు (కాళ్ల పాలెం బుజ్జి) డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2024 ఎన్నికల్లో తామంతా కూటమి ప్రభు త్వానికి మద్దతిస్తూ, ఎన్నికల తరువాత ఒక జిల్లాకు రంగా పేరు పెట్టాలని కోరామని, అయితే ప్రభుత్వంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తమ అభ్యర్థనను గాలికి వదిలేసిం దన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి తమ సంఘ సభ్యులు ఎంతగానో కృషి చేశారని, ఎలక్షన్స్ లో వాడుకుని, ఇప్పుడు వదిలేయడం తగదన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో రంగా విగ్రహాలు పెట్టడానికి కొన్ని రాజ కీయ శక్తులు అడ్డుపడుతున్నాయని, రంగా విగ్రహాలు పెట్ట డానికి రెండు నెలలు వేచి చూస్తామని, లేదంటే తదుపరి తమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ప్రస్తుతం నాలుగు విగ్రహాలు ప్రతిష్టకు నోచుకోలేదని, వాటన్నింటినీ వెంటనే ప్రతిష్టించాలని, ఇలా రంగా విగ్రహాల ప్రతిష్ట వెనుక రాజకీయ కుట్ర ఉందని తాము భావిస్తున్నామన్నారు. రంగా విగ్రహాలను ఇప్పటికీ అనేకం ప్రతిష్టించామని,కేవలం నాలుగు విగ్రహాలు మాత్రమే ప్రతిష్టకు నోచుకోలేదని, వాటిని వెంటనే ప్రతిష్టించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న ఇబ్బందులను తెలుసుకుని జిల్లాను విభజించాల న్నారు. రాష్ట్ర కాపు సంఘం అధ్యక్షుడు తాము రాష్ట్రాన్ని శాసించే స్థాయిలో ఉన్నామని, అయితే విభజించుపాలించు అనే పద్ధతితో తాము ఇలాంటి స్థితికి వచ్చామన్నారు. కాపు లను బీసీల్లోకి చేర్చాలన్న విషయాన్ని ఎవ్వరూ పట్టించు కోవడం లేదని, తాము ఈ విషయమై గత 30 సంవత్సరా లుగా పోరాటం చేస్తున్నామన్నారు. ఆఖరికి రంగా విగ్రహా లను కూడా ప్రతిష్టించుకోనీయడం లేదన్నారు. తమను రాజ కీయంగా కూడా ఎదగనివ్వడం లేదని, దీనిని బట్టి చూస్తుం టే తామెలాంటి పరిస్థితుల్లో ఉన్నామో అర్థమవుతుందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాధా రంగా మిత్రమండలి సభ్యులు కూడా పాల్గొన్నారు.

ఎంపీపీను కలిసిన సచివాలయ సిబ్బంది

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లిలోని కొత్తగా నియ మితులైన మూడు సచివాలయ సిబ్బంది ఎంపీపీ కేవీకే దుర్గారావును మర్యాదపూర్వ కంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఎంపీపీ దుర్గారావు మాట్లాడుతూ సచివా లయ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలులో ప్రజలకు సహకరించాలని వారికి సూచించారు.

స్కిల్ డెవలప్మెంట్, డిజిటలైజేషన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యం

విశాలాంధ్ర - కాకినాడ : రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు అడిగిన ప్రశ్నలపై కేంద్ర మంత్రులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వడమే కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం అందిస్తున్న సహాయం, ప్రాధాన్యతలపై వివరించారు. ముఖ్యంగా నైపుణ్యాభివృద్ధి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల డిజిటలైజేషన్ రంగాల్లో రాష్ట్రానికి వచ్చిన మద్దతు గణనీయంగా ఉన్నట్లు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి రంగంలో కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరి ఇచ్చిన సమాచారం ప్రకారం, కాకినాడ సహా రాష్ట్రవ్యాప్తంగా ఫ్యూచర్ స్కిల్స్, డిజిటల్ టెక్నాలజీ శిక్షణపై స్పష్టమైన దృష్టితో చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఉద్యోగ అవకాశాలకు అనుగుణమైన నైపుణ్యాలను అందించనున్నట్టు తెలిపారు.

ఉత్తమ విద్యార్థికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కాకినాడరూరల్ : రమణయ్యపేట అడబాల ట్రస్ట్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ కాకినాడ ఎలైట్ ఆధ్వర్యంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఉద్యోగుల సౌజన్యంతో ఉత్తమ విద్యార్థికి రూ.15 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు బి ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన రాష్ట్రంగా దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. నేటి విద్యార్థులు చక్కటి విద్యను అభ్యసించడం అత్యంత ఆవశ్యకమన్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన పేద విద్యార్థికి ఉన్నత విద్య కోసం తమ గిడ్డంగుల సంస్థ ఉద్యోగుల సౌజన్యంతో ఈ ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామని ప్రసాద్ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, చింతపల్లి సుబ్బారావు, డాక్టర్ శిరీష, యస్ నగేష్, సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : బాలికలు లేదా మహిళలను మభ్యపెట్టడం, బెదిరించడం లేదా ప్రలోభాలకు గురి చేస్తుంటే ఆ వ్యక్తుల సమాచారాన్ని వెంటనే దగ్గరలో ఉన్న పోలీసులకు తెలియజేయాలని న్యాయవాది రవి శంకర్ పట్నాయక్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అభం శుభం తెలియని బాలికలను ఎక్కువగా దళారులు ట్రాప్ చేసి ఇతర దేశాలకు అక్రమ రవాణా చేస్తున్నారని, విదేశాల్లో మోడల్స్, ఉద్యోగులుగా, ఇంటి పని వారిగా మహిళలకు పని కల్పిస్తామంటూ అక్రమ రవాణా చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి కళాశాలలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - గండేపల్లి : మండలంలోని సూరం పాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, యన్‌సీసీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో, కళాశాల ఐసీఐ విభాగం వారు రక్తదాన శిబిరం నిర్వహించారు. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, కాకినాడకు చెందిన డా టీపీ అనిల్ కుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం కొనసాగింది. కళాశాల ఛైర్మన్ డా కృష్ణారావు మాట్లాడుతూ తమ కళాశాల ఎన్ఎస్ఎస్, యన్‌సీసీ విభాగాల వారు నిర్వహిస్తున్న రక్తదాన శిబిరానికి గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ కాకినాడ వారు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ భవిష్యత్తులో చేపట్టే వివిధ సామాజిక కార్యక్రమాలకు తమ వంతు సహాయం అందిస్తామని పేర్కొన్నారు.

గ్రామాల విలీనంపై మంత్రి పవన్ ప్రకటన చేయాలి

- సీపీఎం డిమాండు

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : రాష్ట్రంలో వివిధ కారణాలతో ఎన్నికలు జరగని, కొన్ని ఉప ఎన్నికల స్థానాలకు సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్ ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ బుధవారం విడుదల చేసిన నేపథ్యంలో కాకినాడ విలీన గ్రామాలైన తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, వలసపాకల, రమణయ్యపేట, వాకలపూడి గ్రామాల భవితవ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని, ముఖ్యంగా సంబంధిత శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రకటన చేయాలని సీపీఎం కాకినాడ రూరల్ మండలం కమిటీ కోరింది. ఈ మేరకు కమిటీ కార్యదర్శి తిరుమలశెట్టి నాగేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పంచాయతీలకు 14 సంవత్సరాలుగా కాకినాడ కార్పొరేషన్‌లో విలీనంగానీ, పంచాయతీ ఎన్నికలు గానీ జరగకపోవడం వలన పరిపాలన అగమ్యగోచరంగా తయారయిందనీ దీంతో ప్రజల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. ఈ పంచాయతీల్లో ఏ అభివృద్ధి జరగడం లేదనీ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండీ ఏ శాఖకు చెందని గ్రామాలుగా ఉండటంతో నిధులు రావడం లేదనీ ఆవేదన వ్యక్తం చేసారు. ప్రత్యేక అధికారితో పాలన ఎన్నాళ్ళు సాగిస్తారో, ఎన్నికలు ఎప్పుడు, ఎలా నిర్వహిస్తారో పవన్ కళ్యాణ్ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని, ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేయాలని నాగేశ్వరరావు డిమాండ్ చేసారు. 73,74 రాజ్యాంగ సవరణతో తప్పనిసరిగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని, ప్రభుత్వం చట్టాన్ని ఉల్లంఘిస్తూ పద్నాలుగు సంవత్సరాలుగా ఎన్నికలు జరుపకుండా ఉంచడం సరైంది కాదన్నారు. గ్రామాలు నిర్లక్ష్యానికి గురవుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం సరైన విధానం కాదని తిరుమలశెట్టి గుర్తు చేశారు. ఈ మధ్యలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఈ సమస్యని పరిష్కరించకుండా వందల కోట్ల రూపాయలు నిధులు కోల్పోయామని, కేంద్ర నిధులూ రాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గ్రామాల్లో ఈ కాలమంతా అవినీతి రాజ్యమేలిందని, నేటికీ అదే కొనసాగిస్తారా లేదా నగరంలో విలీనం చేసి అభివృద్ధి చేస్తూ విలీన గ్రామాల ప్రజల సమస్యలు తీరుస్తారా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణం ఆరు గ్రామాలను కాకినాడ నగర పాలక సంస్థలో విలీనం చేయడానికి తగు చర్యలు వెంటనే చేపట్టాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు కోరారు.

ఉద్యాన పంటల సాగు లాభదాయకం

- ఉద్యానవన శాఖ ఆయిల్ పామ్ విస్తరణ మహోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కరప : ఉద్యానవన శాఖ సర్వే సాయి ఎడిబుల్ ఆయిల్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో సంయుక్తంగా మండలంలోని వేములవాడ గ్రామంలో ఏర్పాటు చేసిన ఆయిల్ ఫామ్ విస్తరణ మహోత్సవానికి కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ పాల్గొని రైతు యార్లగడ్డ భూపాల్ ప్రసాద్ పొలంలో నాటిన పామాయిల్ మహోత్సవంలో పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవుని ఆహారపు అలవాటులలో ఆయిల్ ముఖ్య భూమిక పోషిస్తుందని ఆయిల్ కొరత తీర్చేందుకు రైతులు ఉద్యానవన పంటల సాగు లాభదాయకంగా ఉంటుందని రైతులకు తెలిపారు. ఉద్యానవన శాఖ జిల్లా అధికారి జి విజయలక్ష్మి , ఏడిఏ బాబురావు మాట్లాడుతూ రైతులు వారితో పాటు ఉద్యానవన పంటలు వేసుకోవడం ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో సర్వే సాయి ఆయిల్ ఫామ్ మేనేజర్ ప్రభాకర్ రావు, డిస్టిక్ మైక్రో ఇరిగేషన్ అధికారి వరా ప్రసాద్, పిఠాపురం హెచ్ఓ వైయస్ రాజశేఖర్, వేములవాడ గ్రామ సర్పంచ్ మంగాదేవి, కరపు గ్రామ సర్పంచ్ ఆశాజ్యోతి, తాహశీల్దార్ దుర్గా ప్రసాద్, ఎంపీడీవో అనుపమ, మండలవ్యవసాయ అధికారి సత్య, బండారు మురళి, సొసైటీ ప్రెసిడెంట్లు దూడల నారాయుడు, సైనివరపు భవాని శంకర్, వెలుగుబంట్ల సూరిబాబు, ముద్రగడ రమేష్, మీసాల రాంబాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, కొండబాబు, గంగాధర్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రైతులు ఆశించిన ప్రయోజనాలను పాలకవర్గాలు అందించాలి

-జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బందారు శ్రీనివాస్

విశాలాంధ్ర - ఆత్రేయ పురం : రైతుల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన సహకార సంఘాల ద్వారా వారికి సక్రమమైన సేవలు కల్పించడంలో పాలకవర్గాలు ముందుండాలని కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బందారు శ్రీనివాస్ సూచించారు. ఆత్రేయపురం మండలం ర్యాలీ శ్రీ ఉమా కమండలేశ్వర ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం నిర్వహించారు. సహకార సంఘం అధ్యక్షునిగా మెర్ల నాగేశ్వరరావు సభ్యులుగా పసుపులేటి లోవరాజు అడబాల దుర్గారావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని బందారు శ్రీనివాస్ మాట్లాడుతూ సహకార సంఘాలపై గత ప్రభుత్వ కాలంలో చేపట్టిన కార్యక్రమాలతో పలు సహకార సంఘాలు నష్టాలు ఊబిలోనికి చేరుకున్నాయని అయితే ర్యాలీ సహకార సంఘం మాత్రం లాభాల బాటలో నడుస్తుండడం అభినందనీయమని ఆయన అన్నారు. సహకార సంఘం పాలకవర్గముగా నియమితులైన నూతన చైర్మన్ సభ్యులు ఈ సంఘం మరింత అభివృద్ధి దిశగా తీసుకువెళ్లాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా నూతన పాలక వర్గాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చేకూరి కృష్ణంరాజు, సూరపరెడ్డి సత్య, తోట స్వామి, కంఠం శెట్టిచంటి, బొక్కా ఆది నారాయణ, బందారు బాబి, గారపాటి శ్రీనివాస్ చౌదరి, నల్ల వెంకన్న, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, నామాల ఏసు, బందెల గురవయ్య గ్రామ పార్టీ అధ్యక్షుడు, ర్యాలీ మాజీ సర్పంచ్ పేర్చెర్ల పుల్లంరాజు వర్మ(పేర్చెర్ల నరసింహరాజు), కరటూర్ నరసింహారావు వాడపల్లి మాజీ దేవస్థానం చైర్మన్, మద్దూరి రామకృష్ణ (పార్టీ యూత్ ప్రెసిడెంట్), బందెల శ్రీను నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్, మాకా వీరన్న, తూటపు బాబు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా సుందర్

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు గ్రామానికి చెందిన వడ్డి సుందర్ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమిషనర్‌గా నియమితులయ్యారు. విజయవాడ జోన్-2 జాయింట్ కమిషనర్‌గా బుధవారం ఈయన బాధ్యతలు స్వీకరించారు. ఉభయ గోదావరి (తూర్పు, పశ్చిమ), కృష్ణా జిల్లాలకు జాయింట్ కమిషనర్‌గా సుందర్ విధులు నిర్వహిస్తారు. రాజోలు ప్రాంతానికి చెందిన వ్యక్తి ఈఉద్యోగానికి ఎంపిక కావడం పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చేనేత విభాగం మండలాధ్యక్షుడిగా రమేష్ బాబు

విశాలాంధ్ర - మామిడికుదురు : వైసీపీ చేనేత విభాగం మామిడికుదురు మండల అధ్యక్షునిగా మొగలికుదురు గ్రామానికి చెందిన కారుపర్తి రమేష్ బాబు నియమితులయ్యారు. ఈసందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడతానని అన్నారు. ఆయనకు ఈపదవి లభించేందుకు కృషి చేసిన పి గన్నవరం నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ గన్నవరపు శ్రీనివాస్, వైఎస్సార్సీపీ మండల అధ్యక్షులు కొమ్ముల రాము, ఎంపీటీసీ సమైక్య అధ్యక్షులు దుర్గా ప్రసాద్, మండల నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

పోక్సో, డ్రగ్స్, సైబర్, క్రైమ్ పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - కరప : నక్కా సూర్యనారాయణ మూర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ సబ్జెక్టులో ప్రధానోపాధ్యాయులు ఎన్ రాజ రాజేశ్వరి అధ్యక్షతన బుధవారం పోక్సో, డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కరప ఎస్సై టి సునీత పాల్గొని విద్యార్థులు సమాజం పట్ల అవగాహన కలిగి బాధ్యతతో మెలగాలన్నారు. డ్రగ్స్ విషయంలో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేయడం జరుగుతుందని సైబర్ నేరాలు పట్ల అవగాహన కలిగి ఉండాలని సునీత పేర్కొన్నారు.

ఫోటోగ్రాఫర్ కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటాం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ఫోటోగ్రాఫర్ల కుటుంబాలకు యూనియన్ నుండి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ప్రత్తిపాడు మండల ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సలాది కృష్ణ అన్నారు. కిర్లంపూడి సీనియర్ ఫోటోగ్రాఫర్ పసుపులేటి వెంకన్న బాబు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. బుధవారం ఫోటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. అనంతరం వెంకన్నబాబు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రత్తిపాడు మండల ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ తరపున రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. సలాది కృష్ణ మాట్లాడుతూ వారి కుటుంబానికి అన్ని రకాలుగా సహాయంగా ఉంటామని సీనియర్ ఫోటోగ్రాఫర్, మంచి వ్యక్తిని కోల్పోవడం దురదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ నాయకులు యాళ్ల తాతాజీ, గుత్తుల వీర రాఘవ, చెవల శ్రీనివాసరావు, నామన వెంకట భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

స్నేక్ క్యాచర్ వర్మకు ఘన సన్మానం

విశాలాంధ్ర - అమలాపురం :అమలాపురం ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం అమలాపురం మెయిన్ రోడ్డులోని శ్రీ వాసవి ఫంక్షన్ హాల్ లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సంఘ సేవా కార్యక్రమాలతో పాటు సంఘ అభివృద్ధి కార్యక్రమాలను చర్చించారు. అనంతరం స్నేక్ క్యాచర్ 56 జంపన గణేష్ వర్మ చేస్తున్న సేవలకు ఆయనను సంఘ ఆధ్వర్యంలో సత్కరించారు. కోనసీమ ప్రాంతంలో స్నేక్ కేచర్ గణేష్ వర్మ వేలాదిపాములను సురక్షితంగా పట్టి సురక్షిత ప్రాంతాల్లో వదిలేస్తూ జిల్లా ప్రజల మన్ననలు పొందారు. ఈ సమావేశంలోనే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ శశిధర్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ డిపాజిట్లపై బ్యాంకులు ఇచ్చే వివిధ రుణాలను వడ్డీరేట్లను వివరించారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారుడు నంబూరి విశ్వనాథం, అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వర రావు(విస్సు), కార్యదర్శి నూలు సూర్య ప్రభాకర్ రావు (సూరిబాబు), కోశాధికారి శ్రీకాకోలపు రాంపండు, కో ఆర్డినేటర్ నంబూరి శ్రీనివాస్, వరద సూరిబాబు , సర్వ సభ్యులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే మద్దిపాటి

విశాలాంధ్ర- గోపాలపురం : ఆపదలో ఉన్నవారికి నేనున్నానని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. వెంకటాయపాలెం, పెద్దాపురం, వేళ్ళ చింతల గూడెం, గ్రామాలలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాలలో అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేళ్ళ చింతలగూడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గత శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులు కారణంగా ఇళ్లు కోల్పోయి ఇంటిపై కప్పు పడిపోయిన 28 మంది బాధిత కుటుంబాలకు రూ.3,17,000 నగదును అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా 25 బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం, పెద్దాపురంలోడాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

యువజన సంఘం 25 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ఈదురు గాలుల వల్ల పాక్షికంగాను దెబ్బతిన్న గృహాలకు ఆర్థిక సాయం అందించారు. వేళ్ళ చింతలగూడెం గ్రామపంచాయతీలో కోటి 55 లక్షల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. తల్లికి వందనం, ఇతర అభివృద్ధి పనులకు సుమారు గ్రామంలో ఐదు కోట్ల రూపాయలు అభివృద్ధి జరిగినట్లు తెలిపారు. గోపాలపురం, బీమోలు, వేళ్ళ చింతలగూడెం, బందపురం గ్రామాలకు తారు రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యేని కోరారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు అన్ని పథకాలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కొర్లపాటి. అన్నవరం, గన్నిన మురళి, టీడీపీ మండల వేళ్ళ చింతల గూడెం,బాధితులకుఆర్థిక సాయం అందజేశారు. అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రజా సంక్షేమం పై దృష్టి పెట్టిందని అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధ్యత కుటుంబాలకు అందజేశారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు సీఎం చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి, సమన్వయ కమిటీ సభ్యులు కొర్లపాటి రాము, గద్దె హరి బాబు, వేముల నాగరాజు, వెంకటాయపాలెం, వేళ్ళ చింతలగూడెం కమిటీ అధ్యక్షుడు మునేశ్వరరావు, రాము, సురేష్, చరణ్, పరిమి జగదీశ్, చిట్టి బాబు, టీడీపీ నేతలు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

పలువురుని పరామర్శించిన గీత

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : అనారోగ్యంతో బాధపడుతున్న వైసిపి నాయకులను కాకినాడ మాజీఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ వంగా గీత బుధవారం పరామర్శించారు. ఎండపల్లి గ్రామానికి చెందిన జ్యోతుల చంటబ్బాయి, ఉప్పాడ గ్రామానికి చెందిన సూరాడ కుమార్, నక్క సతీష్‌లను పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉప్పాడ మాజీ వైస్ సర్పంచ్ ఉలవల ఓం నమశ్శివాయ తల్లి మృతి చెందడంతో కుటుంబ సభ్యుల పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం పలు గ్రామాలలో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆమె వెంట మండల వైసీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కారే శ్రీనివాస్, రావు చిన్నారావు, జ్యోతుల చక్రబ్బాయి, మెరుగు ఎల్లాజీ, సర్పంచ్ పాలని దొరబాబు, తదితర వైసిపి నాయకులు ఉన్నారు.

పిఠాపురంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - కాకినాడ : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక సంస్థ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ఏర్పాటు చేయాలని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో చర్చించారు. అలాగే కాకినాడ జిల్లాలో కేంద్ర విద్యా సంస్థలు నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని కోరగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

అప్పారి జ్ఞాన ప్రదీప్‌కు నవోదయ అడ్మిషన్

విశాలాంధ్ర - రావులపాలెం : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఉబలంక రోడ్ ఏరియా) రావుల పాలెంలో ఐదో తరగతి చదివి ఆరో తరగతికి నవోదయ అడ్మిషన్ సాధించిన అప్పారి జ్ఞాన ప్రదీప్‌ను మండల విద్యాశాఖ అధికారులు ఎంఈఓ-1 ఆర్ నాగ కుమార్, ఎంఈఓ-2 బి శ్రీనివాసరాజు అభినందించారు. అనంతరం ఆ పాఠశాల ఉపాధ్యాయులు 2000 రూపాయల నగదు బహుమతిని మండల విద్యాశాఖాధికారులు విద్యార్థికి అందించి విద్యార్థి తల్లిదండ్రులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని జె శాంత కుమారి, యూటీఎఫ్ నాయకులు సిహెచ్ శ్రీధర్, ఇతర ఉపాధ్యాయులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఐవియన్ మూర్తి విద్యార్థిని అభినందించి ఆశీస్సులు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో బీబీ సకీన వర్ధంతి

విశాలాంధ్ర - అమలాపురం : మహమ్మద్ ప్రవక్త మనవరాలు బీబీ సకీనా వర్ధంతి ఘనంగా నిర్వహించారు. అమలాపురంలోని గొల్లగూడెం బీబీ సకిన పీర్ల పంజా వద్ద బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి హైదరాబాద్, విశాఖపట్నం, విజయనగరం నుండి కాక జిల్లాలోని పలు గ్రామాల నుండి అధిక సంఖ్యలో షియా భక్తులు పాల్గొని చిన్నారి బీబీ సకినాకు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి యూపీ రాష్ట్రం నుండి విచ్చేసిన మౌలానా సయ్యద్ తాహిర్ ఆబెది మహ్దీ ముస్లింలు ఉద్దేశించి మాట్లాడుతూ చిన్నారి బీబీ సకీనా షామ్ నేటి (సిరియా) దేశపు చీకటి బంధిఖానాలో యజీద్ చేసిన దుర్మార్గానికి ఆ చిన్నారి బలైందని ఆయన అన్నారు. ఇమామ్ హుస్సేన్ కుటుంబీకులు చేసిన త్యాగాలతోనే ఇస్లాం చరిత్రలో నిలిచిందన్నారు. అనంతరం ఊరేగింపుగా హజరత్ అబ్బాస్, బీబీ సకీనా ఆలంను స్థానిక ముస్లిం వీధి హైస్కూల్ సెంటర్ మీదుగా ఊరేగించారు. తొలుత మజిలీస్సు ఆలపించారు. అనంతరం గుండెలు బాదుకుంటూ మాతంతో రక్తం చిందేల హుస్సేన్, హుస్సేన్ అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ కార్యక్రమానికి పాల్గొన్న భక్తులకు గురుహే అలందారేహుసైని కమిటీ ఆధ్వర్యంలో వచ్చిన భక్తులకు భోజనం ఏర్పాట్లను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఈగల్ క్లబ్‌పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రత్తిపాడు ఎస్సై ఎస్ లక్ష్మీకాంతం అన్నారు. మండలంలోని ధర్మవరం శ్రీ ప్రతిభ విద్యానికేతన్ విద్యార్థులకు ఎస్సై లక్ష్మీ కాంతం ఈగల్ క్లబ్ పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఎస్ లక్ష్మీకాంతం ఈగల్ క్లబ్ ఆవశ్యకత గురించి వివరిస్తూ, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. విద్యాశాఖ అధికారుల ఆదేశాలతో ఈగల్ క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రతిభ విద్యానికేతన్ చైర్మన్ దాసం శేషారావు, ఉపాధ్యాయులు సత్యనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత మిస్సింగ్ కేసును చేదించిన పోలీసులు

విశాలాంధ్ర - గండేపల్లి : సింగరంపాలెం గ్రామానికి చెందిన వివాహిత ఈనెల 18వ తేదీన తన ఇంటి దగ్గర నుంచి ఎవరికీ కని పించకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఆమె కోసం చుట్టుపక్క చుట్టపక్కల బంధువుల ఇంటి వద్ద వెతికారు. ఎంత వెతి కినా ఎక్కడ వెతికిన ఆచూకీ లభించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యా దు చేశారు. వెంటనే స్పందించిన గండేపల్లి సబ్ ఇన్స్పెక్టర్ యువి శివ నాగబాబు తన సిబ్బందితో టీములుగా ఏర్పాటు చేసి రకరకాలుగా ప్రయత్నాలు చేసి ఎట్టకేలకు ఆమె ఆచూకీ హైదరాబాదులో కనుగొన్నారు. ఆమెను బుధవారం సురక్షితంగా కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ శివ తెలియజేశారు.

యల్లమిల్లి, ఎన్టీ రాజాపురంలో 'పొలం పిలుస్తోంది'

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం యల్లమిల్లి, ఎన్టి రాజాపురం గ్రామాలలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి పి చంద్రమౌళి అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పామాయిల్ మొక్కలు, మామిడి, జీడి మామిడి, మొక్కలు గురించి ఉద్యాన శాఖ ద్వారా ఉన్న పథకాలను వివరించారు. ఈ పంట నమోదు ప్రక్రియ ప్రారంభం అయ్యిందని రైతులను, రైతు సేవా కేంద్రం ద్వారా ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రెసి డెంట్ కంటిపూడి సత్యనారాయణ, సుంకవిల్లి సత్యనారాయణ, పెనుమర్తి భాస్కర రావు, దేవిశెట్టి బాబ్జీ, వీఏఏ కె శ్రీను, వీహెచ్ఏ ఉదయ్, రైతులు పాల్గొన్నారు.

నెల్లిపూడి గ్రామంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - శంఖవరం : శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామంలో నెల్లిపూడి గ్రామానికి చెందిన వెలుగుల రవి ఆధ్వర్యంలో మాజీ మంత్రి పిఏసి సభ్యులు ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడి సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని సిద్ధి వినాయకుని ఆలయంలో, గ్రామ దేవత అయిన బోడ కొండమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ నరాల శ్రీను, ఎంపీటీసీ పీర్ల నాగేశ్వరరావు, వెలుగుల ప్రసాద్, వెలుగుల నాగేశ్వరరావు, వెలుగుల చక్రధర్ తదితరులు ఈ ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు

విశాలాంధ్ర - సీతానగరం: బాల్య వివాహాల వల్ల బాలికల్లో అనేక ఆరోగ్య సమస్యలు కలుగుతాయని మండల వైద్య అధికారి డాక్టర్ ఏ వి కె చైతన్య అన్నారు. బుధవారం మండలంలో సీతానగరం గ్రామంలోని స్త్రీ శక్తి భవనంలో డాక్టర్ చైతన్య ఆధ్వర్యంలో ఆరోగ్య శాఖ, శిశు సంక్షేమ శాఖ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముందుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ 19 ఏళ్ల లోపు వయస్సు ఉన్న బాలికలకు బాల్య వివాహాలు జరిపించడం వల్ల వారు వెనువెంటనే గర్భం దాల్చడంతో అనేక ఆరోగ్య, సామాజిక అనర్థాలు సంభవిస్తున్నాయన్నారు. కిషోర బాలికలకు, వారి తల్లిదండ్రులకు,ప్రజలకు విస్తృతంగా అవగాహన కలి గించాలని సూచించారు. అలాగే ప్రతీ గ్రామంలోనూ ఉన్న చైల్డ్ వెల్ఫేర్ కమి టీలు తప్పనిసరిగా బాల్య వివాహాలు,బాల్య గర్భధారణలు అరికట్టడంలో గట్టి కృషి చెయ్యాలన్నారు. ఆగస్టు 12వ తేదీన జరగబోయే నులి పురుగుల నివా రణ దినోత్సవం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోరు కొండ ఐసిడిఎస్ అసిస్టెంట్ సి. డి. పి.ఓ పి వరలక్ష్మి, పి ఎచ్ ఎన్ కె. ఆదిలక్ష్మి, సూపర్వైజర్ కె. సుధాకర్, సూపర్ వైజర్ పెద్దలక్ష్మి, ఇందిరా భారతి ఏఎన్ఎంలు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

ఐటీ సెజ్‌లలో ఉద్యోగుల నివాస గృహాలకు స్థలాలు కేటాయించాలి : ఎంపీ

విశాలాంధ్ర - కాకినాడ : పార్లమెంట్ సమావేశాలు వేదికగా దేశవ్యాప్తంగా ఐటీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తనదైన శైలిలో గళమెత్తారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి)ని అభివృద్ధి చేసే లక్ష్యంతో దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక ఆర్థిక మండళ్లు (సెజ్)లలో ఐటి ఉద్యోగులకు ప్రత్యేకంగా నివాస గృహాల కోసం స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ బుధవారంలోక్ సభ జీరో అవర్లో ఈ అంశాన్ని లేవనెత్తారు. భారత్ ఐటీ సేవల ఎగుమతుల్లో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందని, 2005లో ₹23 బిలియన్ నుండి 2025 నాటికి ₹200 బిలియన్‌కి పెరిగి, 50 లక్షల మందికి పైగా ఉద్యోగావకాశాలు కల్పించిందన్నారు. దేశ వ్యాప్తంగా 351 ప్రత్యేక ఆర్థిక మండళ్ళలో 226 ఐటీ/ఐటీఈఎస్ కంపెనీలకు కేటాయించగా, బెంగళూరు, హైదరాబాద్, గురుగ్రామ్, పుణే, చెన్నై వంటి నగరాల్లో ఐటీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అయితే, ఈ క్లస్టర్లలో పనిచేసే లక్షలాది యువతీ, యువకులకు ప్రధానంగా నివాస సమస్య ఎదురవుతుందన్నారు. సెజ్‌లు పట్టణాలకు దూరంగా ఉండడంతో గంటల తరబడి ప్రయాణ భారంతో పాటు అధిక అద్దెలు ఐటి ఉద్యోగులకు భారంగా మారుతున్నాయని, తద్వారా ఉద్యోగులు మానసిక ఒత్తిడికి గురవ్వడంతో పాటు ఆర్థికంగా నష్ట పోతున్నారన్నారు. సెజ్ చట్టం ప్రకారం నివాస నిర్మాణాలకు అనుమతి ఉన్నప్పటికీ, జాతీయ స్థాయిలో స్పష్టమైన విధానాలు, లేకపోవడం వల్ల అభివృద్ధి మందగిస్తోందని తెలిపారు. కేంద్రం దీనిపై దృష్టి సారించి ఐటీ/ఐటీఈఎస్ సెజ్‌లలో లేదా సమీపంలో నివాస గృహాల నిర్మాణానికి స్పష్టమైన జాతీయ మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. దీనివల్ల పట్టణాల్లో రద్దీ తగ్గడంతో పాటు మహిళా ఉద్యోగుల భద్రతకు ఆస్కారం కలుగుతుందని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

నిరుపేదలకు సీఎం సహాయ నిధి

విశాలాంధ్ర - పిఠాపురం : సీఎం సహాయనిధి ద్వారా వైద్య నిమిత్తం పిఠాపురం నియోజకవర్గంలో అనేకమంది నిరుపేదలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పిఠాపురం ఎమ్మెల్యే కొణిదెల పవన్ కళ్యాణ్ ఆర్థికంగా ఆదుకుంటున్నాడని పిఠాపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసురావు తెలియజేశారు. పిఠాపురం మండలానికి సంబంధించి పలు గ్రామాల లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పిఠాపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసురావు అందజేశారు.

గృహ నిర్మాణ పనులు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఉండాలి : కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అందరికీ గృహం" కార్యక్రమం కింద లబ్ధిదారులకు గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయడం ప్రభుత్వ ప్రాధాన్య లక్ష్యమని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో హౌసింగ్ నిర్మాణాల లక్ష్యంలో దిగువ స్థానంలో ఉన్న ఐదు మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, ప్రభుత్వం అందించిన అదనపు ఆర్థిక సహాయాన్ని గృహ నిర్మాణాల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని, పనుల పురోగతిలో స్పష్టమైన మార్పు కనిపించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జిల్లాలోని సీతానగరం, నల్లజర్ల, దేవరపల్లి, రాజానగరం, కడియం మండలాల పరిధిలో అదనపు ఆర్థిక సహాయం పొందిన 704 మంది లబ్ధి దారుల్లో కేవలం 150 ఇళ్లు మాత్రమే రూఫ్ లెవెల్ దశను చేరుకున్నాయని తెలియజేస్తూ, ఈ పనితీరు ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా లేదని ఆమె స్పష్టం చేశారు. దిగువ స్థాయి లో ఉన్న మండలాల పనితీరు జిల్లా పురోగతిపై ప్రభావం చూపిస్తున్నట్లు తెలిపారు.ఆయా మండలాలలో లబ్ధిదారు లతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ విధి విధానాలను వివరాలు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. అందుకున్న నిధులను సమర్థవంతంగా వినియోగించడంతోపాటు, నిర్మాణ పనుల పురోగతిని వేగవంతం చేయాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి అధికారులదేనని చెప్పారు. గృహ నిర్మాణ దశల వారీ పురోగతికి అనుగుణంగా స్టేజ్ కన్వర్షన్ ప్రక్రియ చేపట్టాలని, ఆయా దశల ప్రకారం బిల్లులు సకాలంలో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. అలాగే ఇసుక, సిమెంట్ వంటి ముడి సరుకులు , మౌలిక సదుపాయాలు అవసరమైన స్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, హౌసింగ్ ఇంచార్జ్ పిడి ఎస్. భాస్కర్ రెడ్డి, సంబంధిత మండలాల ఎంపీడీవోలు, హౌసింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల నిలువు దోపిడీ ఆపాలి

విశాలాంధ్ర - ద్వారకాతిరుమల : 2020 విద్యుత్ సంస్కరణల బిల్లులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజానీకంపై స్మార్ట్ మీటర్ల భారాన్ని మోపడానికి ప్రయత్నిస్తుందని, దానిని రాష్ట్ర ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. బుధవారం ద్వారకాతిరుమల మండలం ద్వారకా తిరుమలలో ప్రజా వేదిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికేయంయు) విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా వర్తక, వాణిజ్య, ప్రజలతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ చైతన్య, బి కే యం యు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ బారాలను వ్యతిరేకిస్తూ ఆగస్టు 5వ తేదీన విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని వారు కోరారు. అదాని స్మార్ట్ మీటర్లు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై వేసే భారాలను తక్షణం విడనాడాలని వారు డిమాండ్ చేశారు. బికేయంయు జిల్లా సహాయ కార్యదర్శి గోలిమే బాల యేసు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ లకు 200 యూనిట్ల వరకు గత ప్రభుత్వాలు ఉచితంగా కరెంటు అందించిన నేటి ఎన్డీఏ ప్రభుత్వం ఆ రాయితీని తొలగించడం ఘోరమైన చర్యగా ఆయన పేర్కొన్నారు. ప్రజా వేదిక ఆధ్వర్యంలో ద్వారక తిరుమ లలో చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రజలు విస్తృతంగా పాల్గొన్నారు. ఆగస్టు5వ తేదీ మంగళవారం విద్యుత్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని ప్రజలంతా పాల్గొని జయ ప్రదం చేయాలని ఆయన కోరారు. సంతకాల సేక రణలో ద్వారకాతిరుమల మండల సిపిఐ సహాయ కార్యదర్శి మాంద్రు బాలరాజు, బికేయంయు ఏలూరు జిల్లా సమితి సభ్యులు యడ్లపల్లి రమేష్, ఎఐటియుసి నాయకులు వై శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు కొప్పుల రామకృష్ణ, ఏపూరి వెంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యడ్లపల్లి సుబ్బారావు, బసవ పూర్ణ చంద్ర ప్రసాద్, గుదే ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు నెల పించన్ల పంపిణీకి సర్వం సిద్ధం

విశాలాంధ్ర - ఏలూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్.టి.ఆర్. భరోసా పింఛన్లను ఆగస్ట్ నెలలో 2,61,592 మంది ఫింఛన్ దారులకు రూ.114.25 కోట్ల రూపాయిలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. ఆగస్టు నెల పింఛను చెల్లింపులపై బుధ వారం సంబంధిత అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.ఆగస్టు నెల పింఛను చెల్లింపులు శుక్రవారం ఉదయం 7.00 గంటలకు ప్రారంభం అవు తుందన్నారు. అనివార్య కారణాల చేత ఆగస్టు 1వ తేదీన తీసుకోని వారికి ఆగస్టు 2వతేదీన పంపిణీ చేస్తారన్నారు. జిల్లాలో 5,303 మంది సచివాలయ, ఇతర ప్రభుత్వ సిబ్బందితో పెన్షన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పింఛనుదారులు సచివాలయ సిబ్బంది ద్వారా వారి సంబంధిత ఇళ్లలో అందుబాటులో ఉండేలా ముందస్తు సమాచారం అందించాలన్నారు.

4,358 కొత్త స్పౌజ్ పెన్షన్లు పంపిణీ : జిల్లాలో ఆగస్టు నెలలో స్పౌజ్ కేటగిరి (వితంతు పించనులు) కొత్తగా 4,358 పెన్షన్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వాటిని ఆగస్టు నెలలో పించనుదారులకు పంపిణి చేస్తారన్నారు.

అక్కిరెడ్డిగూడెంలో పాముకాటుతో రైతు మృతి

విశాలాంధ్ర - ముసునూరు : ముసునూరు మండలం అక్కిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన మొత్తం శెట్టి భాస్కరరావు (65) పాముకాటుతో మృతి చెందిన సంఘటనతో గ్రామంలో విషాద చాయలు నెలకొన్నాయి. బుధవారం ఆ రైతు యధా విధిగా తన పొలంలో పనులు చేసుకుంటున్న క్రమంలో పాము కాటుకు గురయ్యాడు. అది గమనించిన స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యం లో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై ముసునూరు ఎస్సై ఎం చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

అన్న క్యాంటీన్లలో మెనూ తప్పనిసరిగా అమలు చేయాలి

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు ఐదు రూపాయలకే అందిస్తున్న భోజనం మెనూ ప్రకారమే వారికి అందించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ నిర్వా హకులు హరికృష్ణ మిషన్ చారిటబుల్ ప్రతినిధులను సూచించారు. బుధవారం కాకినాడ రమణయ్యపేట లోని ఇండస్ట్రీ ఏరియాలోని హరికృష్ణ మిషన్ చారి టబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ సంబం ధించి సెంట్రల్ కిచెన్‌ను కమిషనర్ భావన సందర్శిం చారు. పెద్దాపురం కమిషనర్ శ్రీకాంత్, కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కేటి సుధాకర్, ఎస్ఈపివెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్విచరణ్ తదితరులు ఉన్నారు.

యాంటిబయోటిక్స్, నార్కోటిక్స్ డ్రగ్స్ వినియోగంపై అవగాహన : ఎస్పీ

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు ఈగల్ టీం, రాజమండ్రి కెమిస్టు, డ్రగ్గిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో యాంటిబయోటిక్స్ నార్కోటిక్స్ వినియోగంపై భారీ అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. జాంపేట గాంధీ బొమ్మ సెంటర్ లో ఈ ర్యాలీని జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ జెండా ఊపి ప్రారంభించారు. డ్రగ్స్ కం ట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ పి.నాగమణి నగరంలోని మెడికల్ షాపు యాజ మానులు, సిబ్బంది, రాజమండ్రి హోల్ సేల్ డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్, తూర్పుగోదావరి జిల్లా డ్రగ్ ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ కిషోర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం కోసం రాష్ట్ర ప్రభుత్వ పిలుపునకు స్పందించి రాజమండ్రిలోని కెమిస్టు, డ్రగ్గిస్టు అసోసియేషన్ ముందుకు రావడం అభినందనీయమ న్నారు. యాంటిబయో టిక్స్, నార్కోటిక్స్ డ్రగ్స్ పై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో రెండు డ్రగ్ అడిక్ట్ కేంద్రాలు ఉన్నాయని, ఇప్పటికే వాటికి అలవాటు పడిన వారికి ఈ కేంద్రాల ద్వారా కౌన్సిలింగ్ ఇప్పిస్తామని ఆయన అన్నారు. గంజాయి విక్రయించే వారిపై పి.డి.యాక్టు నమోదు చేసి, గంజాయి ఉపయోగించే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ పి.నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వం సూచనల మేరకు మెడికల్ షాపుల్లో మందుల విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.వైద్యుల చీటీ లేకుండా కొన్ని రకాల మందులు విక్రయించకుండా చూస్తామని ఆమె చెప్పారు. అనంతరం జాం పేట పోలీసు కన్వెన్షన్ హాలులో అవగాహన సదస్సు జరిగింది.కార్యక్రమంలో రాజమండ్రి కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లా బాల మాట్లాడుతూ, యాంటిబయోటిక్స్ , నార్కోటిక్స్ డ్రగ్స్ వినియోగంపై ప్రజలలో అవగాహన కల్గించడానికి అలాగే, డ్రగ్స్ మీద అపోహలు తొలగించడానికి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రజలు ఇష్టమొచ్చినట్లు యాంటి బయోటిక్స్ వాడడం వల్ల ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని, అందువల్ల ప్రజలు ముందుగా డ్రగ్స్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు రాయపూడి శ్రీనివాసరావు, హోల్ సేల్ అధ్యక్షుడు మహేంద్రనాథ్, సెక్రటరీలు ఫణీంద్ర, కృష్ణ బాలాజీ , వైస్ ప్రెసిడెంట్ పెండెం రాముజీ ,ట్రెజరర్స్ సంపత్‌కుమార్, లాలాధర్, టౌన్ డ్రగ్స్ ఇన్ స్పెక్టర్ హరిహర తేజ, లీగల్ ఎఎస్‌పి మురళీకృష్ణ (అడ్మినిస్ట్రేషన్) తదితరులు పాల్గొన్నారు.